# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 137 | హైదరాబాద్ | మంగళవారం 18-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00





## ప్రింట్ మీడియాకు శుభవార్త చెప్పిన కేంద్రం

11లో

## ఏఐ ఉద్యోగాల కంటే అదే పెద్ద సంక్షోభం

ఆనంద్ మహీంద్రా ట్వీట్



11లో



## స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం

## నేటి భారతం

- జీవితం అంటే నిన్ను నువ్వు చూసుకోవడం కాదు.. నిన్ను నువ్వు రూపుదిద్దుకోవడం..
- నీకు కావలసిన దానికోసం శ్రమించకుండా పోగొట్టుకున్న దానికోసం ఏడవడం మూర్ఖత్వం అవుతుంది..
- నీ జీవితంలో అర్థరహితమైన మాటల కన్నా అర్థవంతమైన నిశ్శబ్దం ఎంతో ముఖ్యం.. అది ఎంతో గొప్పది..
- దేనినైనా ఎక్కువగా నమ్మటం ఎక్కువగా ప్రేమించడం ఎక్కువగా ఆశించడం చాలా తప్పు..
- ఎందుకంటే దానివల్ల వచ్చే ఫలితం కూడా చాలా ఎక్కువగానే ఉంటుంది..
- జరిగిన దాని గురించి ఎప్పుడూ చింతించకు ఎందుకంటే మనకు జరిగే మంచి మనకు ఆనందాన్నిస్తుంది కానీ జరిగిన చెడు అనుభవాన్ని ఇస్తుంది..
- ఈ వాస్తవాలు ఎప్పటికీ గుర్తుంచుకో..

- దోనాల శ్రీకాంత్ రెడ్డి..



11లో

## ఢిల్లీ పేలుడు ఘటనలో కొత్త అంశం

- షూలో ట్రిగ్గర్ మెకానిజం!
- ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు
- ఘటనలో 13 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



11లో

- తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమన్న సుప్రీంకోర్టు
- రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు నిరాకరణ
- పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని సూచన



11లో

## సౌదీలో ఘోర బస్సు ప్రమాదం..

బాధితులను ఆదుకోవాలన్న కేసీఆర్

- ఉమ్రా యాత్రికులతో వెళుతున్న బస్సు దగ్ధం.. 42 మంది మృతి
- మృతుల్లో హైదరాబాద్ మల్లేపల్లికి చెందిన 16 మంది
- ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

## ఆరేళ్ల తర్వాత చైనాకు ఎయిరిండియా..

ఢిల్లీ నుంచి షాంఘైకి నాన్‌స్టాప్ విమానాలు!

11లో



- వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఢిల్లీ-షాంఘై మధ్య నాన్‌స్టాప్ విమానాలు
- వారానికి నాలుగు సార్లు బోయింగ్ 787-8 విమానంతో సేవలు
- 2026లో ముంబై నుంచి కూడా షాంఘైకి సర్వీసులు ప్రారంభించే యోచన
- ఇటీవల ఇండిగో కూడా చైనాకు విమానాలు పునఃప్రారంభం





## వెంటాడుతున్న వైఫల్యాలు..

రేవంత్ రెడ్డి సమకాలీన రాజకీయాల్లో ఒక సంచలనం అని చెప్పవచ్చు.. ప్రపంచంలోనే ఒక ప్రత్యేక చరిత్ర కలిగిన తెలంగాణ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించిన యువ రాజకీయవేత్త.. అడ్రస్ లేకుండా పోయిన కాంగ్రెస్ పార్టీని జవసత్వాలు తీసుకుని వచ్చి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకుని వచ్చిన రాజకీయ వేత్తగా రేవంత్ రెడ్డి ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు.. పదేళ్ల టిఆర్ఎస్ పార్టీని మట్టి కరిపించి ఒంటి చేత్తో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని వచ్చాడు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అనూహ్యంగా ఎన్నెన్నో నిర్ణయాలు తీసుకోవటం జరిగింది.. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం సూచించినట్లుగా పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి ఆ మాట తప్పకుండా వరుసగా అన్ని పథకాలకు రూపకల్పన చేయడం కూడా జరిగింది.. దాంతో తెలంగాణ ప్రజలందరికీ రేవంత్ రెడ్డి ఒక ఆశాజ్యోతి లా కనిపించాడు.. ఇంతవరకు బాగానే ఉంది.. కొద్ది రోజులు గడిచే కొద్దీ రేవంత్ రెడ్డి డొల్లతనం బయటపడసాగింది.. చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో రేవంత్ రెడ్డి క్రమేపి వెనుకంజ వేశాడన్నది విశ్లేషకుల వాదన.. మరీ ముఖ్యంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను రేవంత్ రెడ్డి కూడా చేస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తాయి...

ఆ విమర్శలకు అనుగుణంగానే పరిస్థితులు కూడా గోచరించడం కనిపిస్తోంది.. ముఖ్యంగా పరిపాలనలో కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం, తన ప్రభుత్వ సహచరుల్లో ఎవరిని నమ్మకపోవడం.. కేవలం కమిషన్ల కోసమే కొన్ని పథకాలు రూపకల్పన చేయడం.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు.. ప్రజా అవసరాలకు అనుగుణంగా కాకుండా పార్టీ పెద్దలు చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి నడుచుకోవడం.. ఇలా ఎన్నెన్నో కారణాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి అన్నది అక్షర సత్యం.. పరిపాలనలో ఎంతో మార్పును తీసుకుని వస్తాడు అని భావించిన తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి కూడా ఒక సామాన్యమైన రాజకీయ వేత్తగా కనిపించడంతో యావత్ ప్రజానీకం ఎంతో నిరాశకు గురయ్యారు.. సామాన్య ప్రజల ఆశలన్నీ గాల్లో కలిసిపోయాయి..

12లో

# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ ఏంటి..?

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ? బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించింది. భారతీయ జనతా పార్టీ ఎన్నికల యంత్రాంగం ఇప్పుడు తూర్పు భారతదేశంపై దృష్టి పెట్టింది. ఎన్డీఏగా కలిసి 200కుపైగా సీట్లు సాధించడం, కాంగ్రెస్, వామపక్ష శక్తులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయడం బీజేపీకి భారీ ఉత్సాహాన్నిచ్చింది. ఈ విజయానికి మూలం అధునాతన వ్యూహం, కచ్చితమైన సామాజిక గణాంకాల అర్థం చేసుకోవడమే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు అదే మోడల్‌ను బెంగాల్‌లో అమలు చేయాలనే సంకల్పం పార్టీ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది.పశ్చిమ బెంగాల్ బీజేపీకి అందని ద్రాక్షగానే మిగిలింది. 2021లో తీవ్ర ప్రయత్నాలు చేసినా, మమతా బెనర్జీ ఆధిపత్యం తగ్గలేదు. టీఎంసీ మద్దతు వ్యవస్థ గ్రామీణ స్థాయిలో బలంగా ఉంది. అయినా, బీజేపీ వ్యూహకర్తలు కొత్త రూపకల్పనలో ఉన్నారు. రాష్ట్రంలోని 290 సీట్లలో 75 నియోజకవర్గాలు ముస్లిం ఆధిపత్యంలో ఉండటంతో అవి కఠిన లక్ష్యాలుగా భావిస్తున్నారు. మిగిలిన 220 సీట్లలో కనీసం 140కుపైగా గెలవడం ద్వారా ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవలి ఉప ఎన్నికల్లో హిందూ ఓటర్లలో బీజేపీకి 70 శాతం మద్దతు లభించిందని పార్టీ అంచనా. ఈ ధోరణి కొనసాగితే మమతా కూటమిని గద్దె దించే అవకాశం ఉంది. పార్టీ ప్రధాన వ్యూహకర్త అమిత్ షా స్వయంగా బెంగాల్‌లో పటిష్ట కాషాయ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. పార్టీ రాష్ట్ర యూనిట్‌కు కేంద్ర సహకారం మరింత పెరిగే సూచనలున్నాయి.బెంగాల్ తర్వాత అసోం కూడా బీజేపీకి చాలా కీలకం. హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో గత రెండుసార్లు గెలిచిన బీజేపీ, మూడోసారి విజయం సాధిస్తే అది కొత్త రికార్డు అవుతుంది. కానీ, ఈ రాష్ట్రంలో అహోం కమ్యూనిటీ, ముస్లిం ఓటర్ల ప్రభావం ఎన్నికల లెక్కలు మార్చే అవకాశం ఉంది. కాంగ్రెస్, యూడీఎఫ్ కలిసి మైనారిటీ ఓటు బ్యాంకును ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నాయి. బీజేపీ వ్యూహకర్తలు ముస్లిం ప్రభావం ఉన్న 30 ప్రాంతాలను పక్కనబెట్టి మిగతా చోట్ల గట్టి పోరు ఇవ్వాలనే సంకల్పంలో ఉన్నారు.ఇక తర్వాత తమిళనాడులో ఇప్పటివరకు బీజేపీ గణనీయ స్థాయిలో ఎదగలేదు. అయితే, అన్నామలై నాయకత్వం తీసుకున్న తర్వాత కాషాయ శక్తి కనీసం చర్చనీయాంశంగా మారింది. ఎఐఏడీఎంకేతో కూటమి రీ?అలైన్‌మెంట్, మద్దతు బేస్ విస్తరణ లాంటి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కేరళలో మాత్రం పరిస్థితి భిన్నం. సీపీఎం, కాంగ్రెస్ కూటములు బలంగా ఉండడంతో బీజేపీకి సవాలు కొనసాగుతోంది. 18 శాతం ఓటు వాటా ఉన్నప్పటికీ స్థానాలు దక్కకపోవడం పార్టీకి పెద్ద ప్రతిస్పందనగా నిలిచింది.నరేంద్ర మోడీ తొలిసారి ఎంపీగా విజయం సాధించగానే నేరుగా ప్రధానమంత్రి అయ్యారు. ప్రధాని కాకముందు నరేంద్ర మోడీ చాణక్యతను రాజకీయ విశ్లేషకులు, నాయకులు చాలా తక్కువగా అంచనా వేశారు. ఆయనకు ఢిల్లీ రాజకీయాల్లో అనుభవం లేకపోవడం, అంతేకాకుండా మోదీ కంటే ముందు అధికారంలో ఉన్న ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్?లా ఉన్నత చదువులు లేకపోవడం వల్ల ఆయన విఫలమవుతారని చాలామంది భావించారు., అత్యున్నత పదవులను చేపట్టడానికి విద్య లేదా విశేష అనుభవం అవసరం లేదని నరేంద్ర మోదీ నిరూపించారు. రాజకీయ రంగంలో రాణించాలంటే సాధారణ జ్ఞానంతోపాటు అదృష్టం కూడా చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ప్రధాని మోదీకి ఈ రెండూ పుష్కలంగా ఉన్నాయి. 200 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్‌ను యుద్ధాలను గెలవడానికి ఎలాంటి జనరల్స్ అవసరమని అడిగినప్పుడు.. నెపోలియన్ 'లక్కీ జనరల్స్' అని సూటిగా సమాధానం ఇచ్చాడు. ప్రధానమంత్రిగా మోదీ విజయవంతంగా కొనసాగుతున్నారు. నరేంద్ర మోదీ ఇప్పుడు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ప్రధానమంత్రిగా మోదీ నిస్సందేహంగా విదేశాంగ వ్యవహారాలు, రక్షణ, అంతర్గత భద్రత, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆరోగ్య రంగం తదితర రంగాలలో తనదైన శైలిలో గొప్ప విజయాన్ని సాధించారు. అయితే, ప్రధానిగా మోదీ పెద్దగా విజయం సాధించని రంగాలు కూడా ఉన్నాయి. వ్యవసాయరంగం, ఉపాధి కల్పన, భారతదేశంలోకి పొరు గు దేశాల నుంచి అక్రమ వలసలను ఆపడం, మధ్యతరగతి వర్గాల ఆందోళనను పరిష్కరించడంలో దేశ ప్రధానిగా మోదీ చాలా తక్కువగా విజయాన్ని సాధించారు. ఆర్థిక వ్యవస్థలో పెద్ద పెద్ద కార్పొరేట్లు విజయం సాధించారు. కానీ, అధిక పన్నుల ద్వారా మధ్యతరగతి ప్రజలను దోచుకున్నారు. మునుపటి ప్రభుత్వాల హయాంలో కూడా ఇదే జరిగింది. 160 సంవత్సరాల క్రితం గొప్ప ఫ్రెంచ్ ఆర్థికవేత్త ప్రౌధాన్ ఇలా అన్నాడు 'భవిష్యత్తు అనూహ్యమైనది'. మోదీ వర్తమానాన్ని మేనేజ్? చేయగలడు. కానీ, భవిష్యత్తును మాత్రం మేనేజ్?చేయలేడు. మోదీకి అతిపెద్ద సవాలు ఏమిటంటే కొత్త నాయకులను తయారుచేయడం. ఆయనలాంటి ప్రజాదరణ ఉన్న వ్యక్తిని కనుగొనడం. కానీ, నా బీజేపీ స్నేహితులు 'భారతదేశంలో ఒకే ఒక్క మోదీ ఉన్నాడు. ఆయనలాంటి నాయకుడు ఇంకొకరు లేరు' అని నాకు చెబుతున్నారు. మోదీ విజయవంతమైన ప్రధానమంత్రి అనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. అయితే, ఆయన లేనప్పుడు ఎవరనే అతిపెద్ద సవాలు వస్తుంది. వారసత్వ ప్రణాళికకు ప్రత్యామ్నాయం లేదు. మీ వారసత్వాన్ని మీరే ప్లాన్ చేసుకోవడం బాధాకరం. కానీ, సామ్రాజ్యాలు పేలవమైన వారసత్వం ద్వారా నాశనమయ్యాయి. మోదీ కొత్త నాయకత్వాన్ని ఎలా తయారు చేసుకుంటాడో చూద్దాం, అదే ఆయన ముందున్న అతిపెద్ద సవాలు.

# సెహభాష్ లోకేష్...

విశాఖపట్టణం, నవంబర్ 17,

వ్యక్తి బలంగా ఉంటే వ్యవస్థ అద్భుతంగా రూపుదిద్దుకుంటుంది.. అలాంటి వ్యవస్థను నిర్మించిన వ్యక్తి ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాడు. అంతేకాదు తనలాంటి వ్యక్తులకు మరింత బలాన్ని ఇచ్చి అత్యంత బలోపేతమైన వ్యవస్థను నిర్మిస్తాడు. సరిగ్గా ఇలాంటి సూత్రాన్ని నమ్మారు కాబట్టే చంద్రబాబు నాయుడు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, జాతీయస్థాయిలో అద్భుతమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. తన దూర దృష్టితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఐటి గుమ్మంగా మార్చిన ఆయన.. ఇప్పుడు తన వారసుడు నారా లోకేష్ ద్వారా ఏపీ రాష్ట్రానికి సరికొత్త దశను, అద్భుతమైన దిశను చూపిస్తున్నారు.ఏపీలో ఐటీ మంత్రిగా పనిచేస్తున్న నారా లోకేష్.. ఏపీ రాష్ట్రానికి ఐటి కంపెనీలను తీసుకురావడంలో.. వేలకోట్ల పెట్టుబడులు పెట్టించడంలో విజయవంతమవుతున్నారు. ఇటీవల విశాఖపట్నం నగరంలో గూగుల్ తన డాటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. మరి కొద్ది రోజుల్లో డాటా సెంటర్ నిర్మాణం కూడా పూర్తి కాబోతోంది. ఇది పూర్తయితే విశాఖపట్నం నగరం రూపురేఖలే కాదు.. ఏపీ ముఖ చిత్రమే పూర్తిగా మారిపోతుంది. గూగుల్ డాటా సెంటర్ ద్వారా సరికొత్త ఎకో సిస్టం డెవలప్ అయి.. మరిన్ని ఐటి కంపెనీలు రావడానికి అవకాశం ఏర్పడుతుంది. అయితే ఇండస్ట్రీలను డెవలప్ చేయడానికి.. వినూత్నమైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేవలం పరిశ్రమల కోసమే 50,000 ఎకరాల ల్యాండ్ బ్యాంకును సిద్ధం చేసింది.. ఇదే విషయాన్ని నారా చంద్రబాబు నాయుడు సగర్వంగా ప్రకటించారు.విశాఖపట్నం నగరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చడానికి కంకణం కట్టుకున్న నారా లోకేష్.. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే గూగుల్ సీఈఓ ద్వారా ప్రశంసలు అందుకున్న ఆయన.. తాజాగా విశాఖపట్నంలో జరుగుతున్న అఎఎ సమ్మిట్ ను పెట్టుబడులకు స్వర్గధామం లాగా నిర్మించుకుంటున్నారు. అంతేకాదు దిగ్గజ కంపెనీల అధిపతులను విశాఖపట్నం నగరానికి ఆహ్వానించి.. భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ప్రభుత్వంతో పెద్ద పెద్ద కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకోవడంలో నారా లోకేష్ కీలకపాత్ర పోషిస్తున్నారు. త్వరిత, ప్రభావంతమైన వ్యాపార అభివృద్ధిని సాధించడానికి నారా లోకేష్ దక్షతను ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా పెద్ద పెద్ద కంపెనీల ఆధిపతులను నారా లోకేష్ కన్విన్స్ చేయగలుగుతున్నారు. నారా లోకేష్ పనితీరును కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇతర మంత్రులు ప్రశంసిస్తున్నారు.. అదాని గ్రూప్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో 40 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. అంతేకాదు మరింత స్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉంది. అదాని గ్రూపును ఒప్పించడంలో నారా లోకేష్ తీవ్రంగా కృషి చేశారు. ాజఖీఓం ాఉా మేనేజింగ్ డైరెక్టర్ జస్బీర్ గుజ్రాల్ నారా లోకేష్ పనితీరును అభినందించారు.. తమ కంపెనీ పెట్టే పెట్టుబడులకు సంబంధించి కేవలం 14 రోజుల్లోనే ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయని.. దీనంతటికీ నారా లోకేష్ కారణమని గుజ్రాల్ అభిప్రాయపడ్డారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా సమ్మిట్ నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేశారు.. ఇది బలమైన భాగస్వామ్యాలకు.. ఏపీ ఆర్థిక ముఖ చిత్రం పారిపోవడానికి సహకరిస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.. ఏపీ రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు.. వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.. అయితే ఈ సదస్సుకు అతిరథ మహారథులు.. పెద్దపెద్ద కంపెనీల




ప్రతినిధులు హాజరు కావడంతో విశాఖపట్నం నగరం అంతర్జాతీయంగా ఖ్యాతిని ఆర్జిస్తోంది.

# బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు

విజయవాడ, నవంబర్ 17, (

ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏపీ సీఎం మాట్లాడుతున్నంతసేపు తన చప్పట్లతో ప్రోత్సాహం అందిస్తూ వచ్చారు. అలాగని ఆయన ఏదో ఒక దమ్మీ కేంద్రమంత్రి కాదు. అక్షరాల ప్రధాని నరేంద్ర మోడీ కోర్ టీం లో ఉన్న నేత.2018లో ఎన్డీఏనుంచి దూరమయ్యారు చంద్రబాబు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేసిన ఆయన.. ఉన్నఫలంగా కేంద్ర ప్రభుత్వానికి దూరమయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రాప్ లో పడ్డారు. ఆ సమయంలో కేంద్ర పెద్దలతో ఢీ కొట్టినంత పని చేశారు. అప్పుడే ఏపీలో చంద్రబాబు పని పట్టాలని కేంద్ర పెద్దలు నిర్ణయించుకున్నారు. కేంద్రానికి చెందిన ప్రత్యేక టీం ఏపీలో పనిచేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం వెనుక బిజెపి వ్యూహాలు ఉన్నట్లు అప్పట్లో టిడిపి అనుమానించింది. అయితే 2019 నుంచి 2024 మధ్య ప్రతి పరిణామాన్ని గుణపాఠంగా మార్చుకుంది టిడిపి. తన తప్పు తెలుసుకున్న చంద్రబాబు కేంద్ర పెద్దలతో సఖ్యత ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర పెద్దలు




చంద్రబాబును నమ్మడం లేదన్న ప్రచారానికి చెక్ చెబుతూ.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు అభినందనలతో ముంచెత్తడం విశేషం.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో.. సిఐఐ నేతృత్వంలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరిగింది. దాదాపు 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అయితే కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోంది అని ఈ పెట్టుబడుల సదస్సుతో తేలిపోయింది. గత కొద్ది రోజులుగా ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయి. భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఏర్పాటు అవుతున్నాయి. తద్వారా ఏపీకి తమ సాయం ఉంటుందని కేంద్రం స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. 2014 నుంచి 2024 వరకు ఏపీ విషయంలో కేంద్రం నుంచి అసంపూర్ణ సహకారం అందేది. కానీ గడిచిన 17 నెలల కాలంలో కేంద్రం వైఖరి చూస్తుంటే ఏపీ పట్ల పూర్తి ఉదారస్వభావం చూపుతున్నట్లు అర్థమవుతోంది. స్వయంగా ప్రధానికి అత్యంత సన్నిహితుడు అయిన పీయూష్ గోయల్ ఏపీ సీఎం చంద్రబాబు పట్ల చూపుతున్న గౌరవం చూస్తుంటే మాత్రం.. బిజెపి పెద్దలకు అత్యంత ఇష్టుడైన నాయకుడిగా చంద్రబాబు అవతరించారని అనడంలో ఎటువంటి అతిశయక్తి లేదు.

# చంద్రయాన్ 3 దిశగా అడుగులు

## 2027లో గగన్ యాన్

బెంగళూరు, నవంబర్ 17, (న్యూస్ పల్స్)

చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్ తీసుకువచ్చేందుకు 2028లో చంద్రయాన్?4 మిషన్ ను చేపట్టనున్నట్లు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. 2035 నాటికి భారత్ సొంత స్పేస్ స్టేషన్?ను కూడా నిర్మించుకోనుందని ప్రకటించారు. 2027లో చేపట్టే గగన్ యాన్ మానవ సహిత అంతరిక్ష యాత్ర షెడ్యూల్?లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 7 రాకెట్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది చేపట్టే ప్రయోగాల్లో పూర్తి స్వదేశీ పరికరాలతో రూపొందించిన పీఎస్ఎల్వీ రాకెట్, ఒక కమర్షియల్ కమ్యూనికేషన్ శాటిలైట్ మిషన్, మరికొన్ని పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మిషన్లు కూడా ఉన్నాయని తెలిపారు. చంద్రయాన్?4 మిషన్ కు కేంద్రం ఆమోదం తెలిపిందని, ఇది ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన మిషన్?గా నిలుస్తుందన్నారు. 2028లో ఈ మిషన్?ను చేపడతామన్నారు. ప్రస్తుతం చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్?ను తీసుకురాగలిగే సత్తా అమెరికా, రష్యా, చైనాకే ఉందని, ఈ మిషన్ సక్సెస్ అయితే భారత్ వాటి సరసన చేరుతుందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై వాటర్ ఐస్?పై అధ్యయనం కోసం జపాన్ ఏరోస్పేస్ ఎక్స్ ప్లొరేషన్ ఏజెన్సీతో కలిసి 'లూపెక్స్' మిషన్ కూడా చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా, తదితర దేశాల నేతృత్వంలోని ఐఎస్ఎస్, చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయని, భారత్ కూడా 2035 నాటికి సొంత స్పేస్ స్టేషన్ ను ఏర్పాటు చేసుకోనుందని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే పనులను ప్రారంభించామన్నారు. 2028 నాటికల్లా తొలి 5 మాడ్యూల్స్?ను కక్ష్యలోకి చేరుస్తామన్నారు. మానవ సహిత మిషన్ చేపట్టడానికి ముందు నిర్వహించే మానవ రహిత మిషన్ల షెడ్యూల్ ను మాత్రమే మార్చామన్నారు.

# రాజకీయాల్లోకి వంగవీటి ఆశా కిరణ్

విజయవాడ, నవంబర్ 17,

ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో ప్రముఖ నేత కుమార్తె రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమె మరెవరో కాదు దివంగత వంగవీటి మోహనరంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్. విజయవాడలో ఆదివారం నాడు తన తండ్రి వంగవీటి మోహన రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. రాధా రంగా మిత్రా మండలి ఆహ్వానం మేరకు తాను ఇకపై కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు. తన తండ్రి రంగా ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కొంతకాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉన్న ఆశా కిరణ్, ఇకపై తన ప్రయాణం పూర్తిగా బహిరంగంగా, ప్రజల మధ్య ఉంటుందని స్పష్టం చేశారు.




ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కులం, మతం భేదం లేకుండా సహాయం చేసిన ఏకైక వ్యక్తి తన తండ్రి రంగా అని ఆమె అన్నారు. ప్రస్తుతం రాధా రంగా మిత్రా మండలి మధ్య ఉన్న గ్యాప్‌ను పూరించడానికి తాను వస్తున్నానని ఆశా కిరణ్ స్పష్టం చేశారు.వంగవీటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యమైన వ్యక్తి. ఆయన పూర్తి పేరు వంగవీటి మోహన రంగా రావు. 1980లలో ఆయన కాపు సామాజిక వర్గ నాయకుడిగా విజయవాడ ప్రాంతంలో బలమైన రాజకీయ నేతగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ తరపున క్రియాశీలకంగా పనిచేసిన రంగా, 1985లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు.రంగా జీవితం రాజకీయాలు ప్రత్యర్థులతో పాత కక్షలు, ఘర్షణలతో నిండి పోయింది. 1988లో టీడీపీ హయాంలో ఆయన హత్యకు గురి కావడం అప్పటి రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద అలజడి సృష్టించింది. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లకు దారితీసి, విజయవాడలో హింసాత్మక వాతావరణానికి కారణమైంది. రంగాను ఆయన అనుచరులు కాపు సామాజిక వర్గం నాయకుడిగా, ప్రజా పోరాట యోధుడిగా భావిస్తారు. రాధా-రంగా మిత్ర మండలి వంటి సంస్థలు ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతూ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లో కొనసాగుతున్నా అనుకున్న స్థాయిలో రాణించలేకపోయారు. రాధాకృష్ణ 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.ప్రస్తుతం రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ముందుగా ఆయన 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత 2009లో ప్రజారాజ్యం నుంచి, 2014లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఆయన రాజకీయాల్లో అంత చురుగ్గా లేరు. ప్రస్తుతం ఆయన విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తాను అనడం ఆసక్తికరంగా మారింది.

జనసేనలోకేనా..


చేరేది ఆ పార్టీలోనే?

వంగవీటి రాధాకృష్ణ అనుకున్న స్థాయిలో రాజకీయాల్లో రాణించలేకపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయన సోదరి వంగవీటి ఆశ రాజకీయాల్లోకి వస్తుండడం కొత్త సంచలనాలకు వేదిక కానుంది. అయితే ఆమె ఏ పార్టీలో చేరుతారు అన్నది హాట్ టాపిక్ గా మారింది. అయితే తెలుగుదేశం పార్టీలో చేరిక విషయంలో భిన్న వైఖరి ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరే విషయంలో మాత్రం అనేక సందేహాలు ఉన్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే ఆమె జనసేనలో చేరుతారని మాత్రం తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో బలమైన నాయకత్వాన్ని పవన్ కోరుకుంటున్నారు. జనసేన ప్రాతినిధ్యం పెరగాలని భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వంగవీటి ఆశయాలు జనసేనలోకి తెప్పించి కీలక బాధ్యతలు కట్టబెడతారని తెలుస్తోంది. మరి చూడాలి ఏం జరుగుతుందో?

# 19న పుట్టపర్తికి ప్రధాని...

అనంతపురం, నవంబర్ 17,

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపుర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు జరుగుతున్నాయి గత గురువారం రోజున ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్నారు. మరోవైపు సత్యసాయి శతజయంతి సందర్భంగా బాలికల కోసం సత్యసాయి ట్రస్టు కొత్త పథకం తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. నవంబర్ 19న ప్రధానమంత్రి మోదీ పుట్టపర్తికి రానున్నారు. ఈ సందర్భంగా ప్రధాని చేతుల మీదుగా పథకం ప్రారంభిస్తారనే వార్తలు వస్తున్నాయి. అయితే ఇది కేవలం సత్యసాయి జిల్లాకే పరిమితమా.. కాదా అనేది కూడా తెలియాల్సి ఉంది.సత్యసాయి ట్రస్టు..




రాయలసీమ జిల్లా ప్రజలకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు, విద్యార్థులకు అండగా నిలుస్తోంది. సామాజిక అవసరాలను గుర్తిస్తూ.. పేదల బతుకుల బాగు కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ప్రస్తుతం సత్యసాయి శత జయంతి కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే.గురువారం రోజు నుంచి (నవంబర్ 13) పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్నారు. వీరి కోసం ట్రస్టు భోజన ఏర్పాట్లు కూడా చేసింది. అయితే సత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా బాలికల కోసం ఓ కొత్త పథకం తెచ్చే ఆలోచనలో సత్యసాయి ట్రస్టు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన లేదు.అయితే ప్రభుత్వ స్కూళ్లల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న బాలిక వివరాలు ఇవ్వాలని శ్రీసత్యసాయి జిల్లా డీఈవోను సత్యసాయి ట్రస్టు అధికారులు కోరటంతో ఈ వార్తలకు బలం చేకూరుతోంది.జిల్లాలో పదేళ్లలోపు బాలికలు 3800 మంది వరకూ ఉన్నట్లు అధికారుల అంచనా. ఈ వివరాలనే శ్రీసత్యసాయి ట్రస్టుకు అందించినట్లు తెలిసింది. పోస్టల్ డిపార్టుమెంట్ సాయంతో వీరికి పోస్టాఫీసుల్లో అకౌంట్లు తెరిచే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. బ్యాంక్ అకౌంట్లు తెరిచిన తర్వాత మండలాల వారీగా బాలికల అకౌంట్లోకి కొత్త మొత్తాన్ని ట్రస్టు జమ చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించే ఆలోచనలో ట్రస్టు యాజమాన్యం ఉన్నట్లు తెలిసింది.మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 19న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రానున్నారు. శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలలో పాల్గొనడం కోసం నవంబర్ 19వ తేదీన ప్రధానమంత్రి మోదీ పుట్టపర్తికి రానున్నారు. నవంబర్ 19వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రధానమంత్రి మోదీ పుట్టపర్తికి చేరుకుంటారు. వేడుకల్లో పాల్గొన్న అనంతరం.. 11.15 గంటలకు తిరిగి బయల్దేరనున్నట్లు సమాచారం.ఈ సందర్భంగానే శ్రీసత్యసాయి ట్రస్టు బాలికల కోసం తీసుకువచ్చే కొత్త పథకాన్ని మోదీ ప్రారంభిస్తారంటూ వార్తలు వస్తున్నాయి. మరోవైపు నవంబర్ 23న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర రాష్ట్రాల సీఎం, గవర్నర్ల సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరుకానున్నారు.

## అమ్మవారి బ్రహ్మోత్సవాలకు రంగుల విద్యుత్ వెలుగులు

తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు సోమ వరం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఇప్పటికే తిరుచానూరులో చేసిన విద్యుత్ అలంకరణ పనితీరును ఆదివారం రాత్రి జేఈవో వీరబ్రహ్మం సి వి ఎస్ ఓ మురళీకృష్ణ పరిశీలించారు. అమ్మవారి ఆలయ గోపురం ప్రకారం ధ్వజస్తంభం మహా ద్వారం



వాకిలి వద్ద చేసిన విద్యుత్ లైట్లు తో పాటు తిరుచానూరు పలు ప్రదేశాలలో అమర్చిన కటౌట్లు తోరణాలు నాలుగు మాడ వీధుల్లో లైట్లు గ్యాలరీలు ఆలయం ముందు భారీ కేడ్లు పనులు పూర్తయ్యాయి అమ్మవారి ఆలయానికి రంగులు వేసి నాలుగు మాడ వీధుల్లో రంగురంగుల ముగ్గులు వేసి వాహన సేవలు వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా మొబైల్ స్టాండ్లు మరుగుదొడ్లు ప్రత్యేక క్యూ లైన్లు అన్న ప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దేవతమూర్తుల్లా విద్యుత్ కటౌట్లు స్వాగత తోరణాలు వాహనాలపై ఉత్సవమూర్తులు స్పష్టంగా కనిపించేలా మాడవీధుల్లో లైట్లు ఏర్పాటు చేసారు.

# హిందూపురంలో ఏం జరుగుతోంది...

అనంతపురం, నవంబర్ 17,

హిందూపురం వైసీపీ ఇంచార్జ్ దీపికా రెడ్డి భర్త వేణురెడ్డి కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఆయన బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారనిఈ దాడి చేశారు. ఎవరో హైదరాబాద్ లో ఉండే వాడి కాళ్ల కింద బతుకుతున్నాం.. వారికి ఓట్లు వేస్తాం, వారు హైదారబాద్‌లో కూర్చుంటాడు. మనం ఇక్కడ బానిస బతుకులు బతుకుతున్నాం... అని ఆయన వ్యాఖ్యానించారు. వేణురెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేసి.. ఆయన కార్యాలయంపై దాడి చేశారు. వేణు రెడ్డి భార్య దీపికారెడ్డి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు తమ కార్యాలయంపై దాడి చేశారని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై టీడీపీ నాయకులు , బాలకృష్ణ అనుచరులు చేసిన హింసాత్మక దాడి ప్రజాస్వామ్యంపైనే ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఫర్నిచర్ పగలగొట్టడం, గాజు అద్దాలను పగలగొట్టడం, కార్యకర్తలపై భౌతికంగా దాడి చేయడం ప్రజాస్వామ్య నిబంధనల ప్రమాదకరమైన పతనాన్ని సూచిస్తుందని జగన్ అన్నారు. పోలీసులు పట్టించుకోకపోవడం మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయ ఎజెండా కోసం ఆంధ్రప్రదేశ్ శాంతిభద్రతల యంత్రాంగాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారనే దానికి ఇది సూచికన్నారు. హిందూపురంలో టీడీపీ అల్లరిమూకలను ఎలా ప్రోత్సహిస్తున్నారో.. అల్లర్ల ద్వారా రాజకీయ వ్యతిరేకతను అణిచివేయడానికి ప్రయత్నిస్తుందో స్పష్టంగా చూపిస్తుందన్నారు. తన ప్రత్యర్థుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను రక్షించలేని ప్రభుత్వానికి పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది వైసీపీ పై మాత్రమే కాదు, ప్రజాస్వామ్యం, రాజకీయ స్వేచ్ఛను విశ్వసించే ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు .బాలకృష్ణ ఎక్కువగా నియోజకవర్గంలో ఉండరని ప్రచారం చేస్తూ.. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోనే దాడులు చేసినట్లుగా టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై ఇంకా బాలకృష్ణ స్పందించలేదు.




తెరపైకి లోకల్ అస్త్రం

హిందూపురంలో లోకల్ నినాదం తేవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి గెలుపొందుతూ వస్తోంది. ఇక్కడ టిడిపిని మట్టి కరిపించాలని ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. ఈ నియోజకవర్గంలో టిడిపికి బలమైన పునాది ఉంది. దీని వెనుక నందమూరి కుటుంబం కృషి ఉంది. ఈ నియోజకవర్గ నుంచి నందమూరి తారక రామారావు ప్రాతినిధ్యం వహించారు. అటు తరువాత హరికృష్ణ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇదే నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించారు నందమూరి బాలకృష్ణ. ఎన్నెన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నా విపక్షాలకు హిందూపురం నియోజకవర్గం చిక్కలేదు. 2024 ఎన్నికల్లో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఇప్పుడు వైసీపీ లోకల్ నినాదం తేవాలన్న ప్రయత్నంలో ఉన్నట్టు కనిపిస్తోంది.చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే రాజకీయాల్లో కూడా రాణిస్తున్నారు బాలకృష్ణ. హిందూపురం శాసనసభ్యుడిగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించిన ఆయన సినిమాలను కూడా కొనసాగిస్తున్నారు. అయితే నియోజకవర్గ విషయంలో మాత్రం ప్రత్యేక దృష్టితో ఉంటారు. ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి తప్పకుండా పర్యటనలు చేస్తారు. మరోవైపు ఇటీవల బాలకృష్ణ సతీమణి వసుంధర సైతం ఎక్కువగా నియోజకవర్గానికి వస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు.

అటువంటి నియోజకవర్గంలో బాలకృష్ణ హవా చూస్తున్న ప్రత్యర్థులు హడలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా నందమూరి బాలకృష్ణ పై హిందూపురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ వేణు రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై టిడిపి శ్రేణులు దాడి చేసే దాకా పరిస్థితి వచ్చింది.గత ఎన్నికల్లో దీపిక రెడ్డి అనే మహిళ నేతను రంగంలోకి దించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. చాలా సమీకరణలను వడబోసి దీపిక రెడ్డి సరిపోతారని భావించి ఆమెను పోటీలో పెట్టారు. అయితే ఆమె కనీసం బాలకృష్ణ కు పోటీ ఇవ్వలేకపోయారు. అయితే ఇప్పుడు తాజాగా నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉన్న వేణు రెడ్డి మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. హైదరాబాదు నుంచి ఎవడో ఏలుతున్నాడని.. ఇంకెన్నాళ్లు ఈ బానిస బతుకులు అంటూ చేసిన వ్యాఖ్యలు టిడిపి శ్రేణులను ఆగ్రహం తెప్పించాయి. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై దాడి జరిగింది. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి సైతం ఇంగ్లీషులో ట్వీట్ చేశారు. టిడిపిని రెచ్చగొట్టి.. శాంతిభద్రతల విఘాతంతో పాటు తప్పుడు ప్రచారం చేసేందుకు దీనిని ఒక ప్రయత్నం గా మలుచుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల్లో బాలకృష్ణను ఓడించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలో అనేక ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకున్నారు.2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ ఓడించేందుకు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం బాలకృష్ణ గెలిచేసరికి వైసిపి కి మైండ్ బ్లాక్ అయింది. అందుకే 2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ గెలవకూడదని జగన్ భావించారు. ఆ బాధ్యతను సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు. ఆయన తన సొంత నియోజకవర్గ పుంగనూరును కాదని హిందూపురంపై ఎక్కువగా దృష్టి పెట్టారు. అయినా సరే ఫలితం లేకపోయింది. అయితే ఇప్పుడు బాలకృష్ణ పై తప్పుడు ప్రచారాలకు వైసీపీ దిగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదంతా రెచ్చగొట్టడంలో భాగమేనని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# అంతా పిఠాపురంలోనే పవన్ ఫ్యూచర్ ప్లాన్

## మరో 2 ఎకరాలు కొనుగోలు

కాకినాడ, నవంబర్ 17

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను తొలిసారిగా అసెంబ్లీకు పంపించిన పిఠాపురం నియోజకవర్గం అంటే ఎనలేని అభిమానాన్ని పెంచుకున్నట్లు తాజా పరిణామాలను బట్టి అర్థమవుతోంది. రాబోయే రోజుల్లోనూ పవన్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశాలుండగా ఆయన పిఠాపురంలో స్థానికునిగా ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్పష్టంగా కనిపిస్తోంది.. ఇప్పటికే పిఠాపురంలో 18 ఎకరాలు భూమిని కొనుగోలు చేసిన పవన్ కల్యాణ్ తాజాగా మరో 2.63 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూములకు ఆనుకునే ఈ నెలాఖరు నాటికి మరో 2 ఎకరాలుకుపైగా భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని బట్టి పిఠాపురం నియోజకవర్గంలోనే తన రాజకీయ ప్రస్థానం కొనసాగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పిఠాపురంలో జనసేన పార్టీ కార్యాలయంతోపాటు, ఆయనకు ప్రత్యేక గెస్ట్‌హౌస్ నిర్మాణం చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పిఠాపురం హైవేను ఆనుకుని పవన్ తన కార్యకలపాలను నిర్వహించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. 216 జాతీయ రహదారిని ఆనుకుని పిఠాపురం – గొల్లప్రోలు టోల్ ప్లాజాకు సమీపంలో ఈ భూమి ఉంది. గతంలో 18 ఎకరాలు ఒకే బిట్ కొనుగోలు చేసిన పవన్ తాజాగా మరో 2.63 ఎకరాల భూమిని కూడా కొనుగోలు చేయడంపై పిఠాపురం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు ప్రణాళికను పిఠాపురం నుంచే సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 13వ తేదీన ఆయన పిఠాపురంలో ఎల్‌పి.నెం 100, 105, 211లో 2.63 ఎకరాల భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందుకు ఆయన తరుపున సివిల్ సప్లై ఛైర్మన్ తోట సుధీర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 216 జాతీయ రహదారికి ఆనుకుని ఇలింద్రాడ రెవెన్యూ పరిధిలో తూర్పు, ఈశాన్య స్థలాన్నిఆయన కొనుగోలు చేయగా ఈ స్థలానికి ఆనుకుని ఉన్న 2.63 ఎకరాల భూమిని ఆయన సొంతం చేసుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన జలిగంపల కమల నుంచి ఈ భూమిని



కొనుగోలు చేశారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన భూమికి వెనుక వైపు ఉన్న మరో 2 ఎకరాలకుపైగా భూమితోపాటు ఈ ల్యాండ్‌ను ఆనుకుని ఉన్న మరోకరి భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ఆ ఇద్దరి రైతుల భూమి కూడా పవన్ కొనుగోలు చేసే అవకాశం ఉందంటున్నారు. భారీ మొత్తంలోనే వెచ్చించి ఈ భూమిని పవన్ దక్కించుకుంటున్నారని చెబుతున్నారు.తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉ ండడంతోపాటు స్థానికేతరుడు, పిఠాపురంలో ఎమ్మెల్యే ఉ ండడంలేదన్న అపనిందను తొలగించుకోవాలని ఆయన ప్రయత్నాలు ఉన్నాయంటున్నారు. ఇందులో భాగంగానే పవన్ కల్యాణ్ భవిష్యత్తు ప్రణాళిక అంతా పిఠాపురం నియోజకవర్గం నుంచి ఉంటుందంటున్నారు. అందుకే పిఠాపురం–గోల్లప్రోలు టోల్ ప్లాజా మార్గంలో 216హైవేకు ఆనుకుని తూర్పుమార్గంలో ఉన్న ప్రస్తుత భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోగా తాజాగా కొనుగోలు చేసిన భూమిలోనే జనసేన పార్టీ కార్యాలయంతోపాటు, గెస్ట్‌హౌస్ కూడా కడతారని అంటున్నారు. మరో రెండు మూడు నెలల్లో ఈపనులు ప్రారంభమవుతాయని చెబుతున్నారు. పవన్ పిఠాపురం కేంద్రంగా పవన్ ఫ్యూచర్ ప్లాన్‌కు అడుగులు వేస్తున్నారని జనసైనికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కొనుగోలు చేసిన స్థలంలో నిర్మాణాలు ప్రారంభించడానికి దాదాపు అన్ని ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయని చెబుతున్నారు.

# జగన్ బిందాస్ గా ఉంటే ఎలా...


విజయవాడ, నవంబర్ 17,

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు బీహార్ ఎన్నికల ఫలితాలు వార్నింగ్ బెల్స్ లాంటివి. ఒకటి గమనించారా.. ఆంధ్రప్రదేశ్ లో 2024లో ఎన్నికలు తరహాలోనే బీహార్ లోనూ రెండో విడత ఒక్కసారిగా పోలింగ్ శాతం పెరిగింది. అదీ సాయంత్రం ఐదు గంటల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు క్యూ లైన్ లో నిలబడి ఎన్డీఏ అభ్యర్థులకు ఓటు వేశారు. ఏపీలోనూ మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది. అందుకే బీహార్ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ కూటమికి 202 స్థానాలు లభించాయి. అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. ఇక్కడ 2024 ఎన్నికల్లో వైసీపీకి కూడా కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వచ్చాయి. అందుకే జగన్ ప్రస్తుత ప్రభుత్వంపై వ్యతిరేకతతో తాను తిరిగి అధికారంలోకి వస్తానని కూర్చుంటూ మళ్లీ ఒకసారి బెంగళూరుకే పరిమితమవ్వాల్సి ఉంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇప్పుడు బీజేపీ కూటమి ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా విజయం సాధిస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వంటి వాటిని వారు పెద్దగా పట్టించుకోరు. శాసనసభ ఎన్నికలపై సీరియస్ గా మోదీ నుంచి పార్టీ అగ్రనేతలందరూ దృష్టి పెడతారు. అప్పుడు కర్సయిపోయేది విపక్షంలో ఉన్నవారు మాత్రమే. ప్రభుత్వ వ్యతిరేకత తనకు అనుకూలంగా మారుతుందని భావించి జగన్ ఏ మాత్రం అలక్ష్యం వహించినా ఏపీలోనూ బీజేపీ బీహార్ వంటి స్ట్రాటజీనే అనుసరిస్తుంది. అందుకు ఎంత మాత్రం వెనకాడదు. చంద్రబాబు నాయుడు కూడా అదే నమ్మకంతో ఉన్నారు. తన నాయకత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకంతో పాటు, మోదీ, పవన్ కల్యాణ్ చరిష్మాతో మరొకసారి విజయం సాధిస్తామన్న ఉద్దేశ్యంలో ఉన్నారు. అందుకే టీడీపీ ఇక ఎప్పటికీ ప్రతిపక్షంలో ఉండదని ఇటీవల చంద్రబాబు కామెంట్ చేయడానికి కారణం కూడా అదే కావచ్చు అయితే బీజేపీకి జగన్ పై కొంత సాఫ్ట్ కార్నర్ ఉన్నట్లే కనపడుతుందని వైసీపీ నేతలు భావించవచ్చు..

# గ్రేటర్ తిరుపతి విస్తరణ దిశగా అడుగులు

తిరుపతి, నవంబర్ 17,

ఏపీలోని కూటమి ప్రభుత్వం.. తిరుపతి అభివృద్ధి కోసం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ తిరుపతగా విస్తరించేందుకు రెడీ అయ్యింది. ఈక్రమంలో చంద్రగిరి, రేణిగుంటతో పాటు మరో రెండు మండలాల్లోని 10 గ్రామ పంచాయతీలను తిరుపతిలో విలీనం కాబోతున్నాయి. నవంబర్ 18న జరిగే అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందనున్నాయి. దీంతో తిరుపతి గ్రామీణ మండలం పూర్తిగా గ్రేటర్ పరిధిలోకి రానుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిని అభివృద్ధి చేయడం కోసం గ్రేటర్ తిరుపతిగా మారుస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో తిరుపతి విస్తీర్ణం మాత్రమే కాక... ఆదాయం, జనాభా కూడా పెరుగుతుంది. అలానే చంద్రగిరి, రేణిగుంట వంటి



పెద్దం పంచాయతీలు కూడా తిరుపతిలో కలసిపోయాయి. ఈక్రమంలో మరికొన్ని గ్రామ పంచాయతీలను గ్రేటర్ తిరుపతిలో కలిపిందేకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరో రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందనున్నాయిగ్రేటర్ తిరుపతి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలకు.. గత నెల అనగా అక్టోబర్ 24న తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం తర్వాత తిరుపతి నగర విస్తీర్ణం 30.17 చదరపు కిలోమీటర్ల నుంచి 283.80 చ.కి.మీకి పెరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు.. తిరుపతి మహా నగరపాలికలో.. నాలుగు మండలాలైన చంద్రగిరి, ఏర్పేడు, తిరుపతి గ్రామీణ, రేణిగుంట మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని జిల్లా అధికారులు ప్రతిపాదనలు చేశారు. అయితే వీటిల్లో 53 గ్రామ పంచాయతీలు మాత్రమే విలీనం కోసం నిర్ధారించారు. మరో 10 గ్రామ పంచాయతీలు మిగిలిపోయాయి. తాజాగా నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో వాటిని కూడా విలీనం చేస్తూ నిర్ణయం తీసుకోనున్నారు.ముందుగా ప్రతిపాదించిన 63 గ్రామ పంచాయతీల విలీనంలో మిగిలిని పది గ్రామ పంచాయతీలను కూడా గ్రేటర్ తిరుపతి పరిధిలో విలీనం చేయనున్నారు. మరో రెండు రోజుల్లో అనగా నవంబర్ 18న నగరపాలక సంస్థ అధికారులు నిర్వహించబోయే.. అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించనున్నారు. దీంతో తిరుపతిలో గ్రామ పంచాయతీల విలీనం అంశం కొలిక్కి వచ్చినట్లు అవుతుంది.గత నెల అనగా.. అక్టోబర్ 24న తిరుపతి నగర పాలక సంస్థలో 63 గ్రామాలను విలీనం చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆ 63 గ్రామాలు, హాబిటేషన్లను యూనిట్లుగా మార్చారు అధికారులు. అయితే ఈ మొత్తం 63 పంచాయతీల్లో 53 మాత్రమే విలీనం కోసం నిర్ధారించారు. మరో పది గ్రామ పంచాయతీలు మిగిలిపోయాయి.ఈ క్రమంలో నాలుగు మండలాల నుంచి 10 గ్రామ పంచాయతీలను కూడా త్వరలోనే గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయనున్నారు. వీటిల్లో తిరుపతి గ్రామణ మండలం నుంచి 5 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలానే చంద్రగిరి మండలం నుంచి 3, రేణిగుంట నుంచి ఒకటి, రామచంద్రాపురం నుంచి ఒక గ్రామ పంచాయతీ చొప్పున మొత్తం 10 గ్రామ పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనలు ఆమోదించనున్నారు. దీంతో తిరుపతి గ్రామీణ మండలం పూర్తిగా గ్రేటర్ తిరుపతి

## పాత్రికేయ రంగం సమాజానికి మార్గదర్శకం: జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 17:

ప్రజాస్వామ్య దేశంలో పాత్రికేయ రంగం సమాజానికి మార్గదర్శకం అని, బ్రిటిష్ కాలం నుండి పత్రికా రంగం ప్రజల విశ్వాసాన్ని పొందిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో జాతీయ పత్రిక దినోత్సవ వేడుకలను ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు ఆధ్వర్యంలో




ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిర్రా రవి, గుద్దేటి రమేష్ బాబు లు మాట్లాడుతూ అనాదిగా పాత్రికేయ రంగం సమాజానికి మార్గదర్శకంగా ఉండి వారు అందిస్తున్న వార్తలు పత్రిక రూపంలో ప్రజల మన్నులను పొందుతున్నాయని అన్నారు. 1966లో జస్టిస్ జె.ఆర్ ముధోల్కర్ నేతృత్వంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ఏర్పడిందని, అదే ఏడాది నవంబరు 16 నుంచి ఇది పని చేయడం ప్రారంభించిందని, ఏటా ఇదే తేదీన 'జాతీయ పత్రికా దినోత్సవం'గా కొనసాగుతూ వస్తుందని అన్నారు. జర్నలిస్టులు బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జర్నలిస్టులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, పాలాబోయిన శ్రీకాంత్, కోణతాలపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి బిక్కి గోపి, జర్నలిస్ట్ నాయకులు కూరపాటి నరేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, ఎస్.డి యాదగిరి, శ్రీధర్, రోజా, ఉల్లోజు రమేష్, పెంటి వెంకటేశ్వర్లు, పులి శ్రీనివాస్, ఉపేందర్, కొండల్, కెమెరామెన్ శంకర్, శంకర్, పానకాలరావు, జీవన్ రెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా విశ్వకర్మ ఉద్యోగుల వన సమారాధన

### పారంపర్య వైద్యులు రామడుగు వీరభద్రాచారికి ఘన సన్మానం

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 17:

విశ్వకర్మ ఉద్యోగుల వన సమారాధన అట్టహాసంగా జరిగింది. ఖమ్మం లోని చెరుకూరి వారి తోట లో

విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకలకు విశ్వకర్మ బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. తొలుత విశ్వకర్మ భగవానుడి పూజ, మహాశివుడి అభిషేకం అనంతరం విశ్వకర్మ భగవానుడి జండా ఆవిష్కరణ చేశారు.

వివిధ రంగాలలో సామాజిక సేవలను నిర్వహిస్తున్న విశ్వకర్మ



ప్రముఖులను ఘనంగా సత్కరించారు. దీనిలో భాగంగా ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ పారంపర్య వైద్యులువైద్య రామడుగు వీరభద్రాచారి దంపతులను ఘనంగా సన్మానించారు.

గత 45 సంవత్సరాలుగా ఆయుర్వేద సిద్ధ హెూమియోపతి ప్రకృతి వైద్యులుగా పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఎందరో రోగులకు వైద్య సేవలను అందిస్తున్నందుకుగాను,

ఎందరో ఆత్మహత్య ప్రేరేపితులకు తన ఉచిత కౌన్సిలింగ్ ద్వారా జీవితం పట్ల ప్రతికూలమైన ఆలోచనల నుండి బయటపడేసి, సానుకూలమైన ఆలోచనలను కలిగించి కొత్త జీవితంలోనికి అడుగిడేందుకు కృషి చేస్తున్నందుకు గాను రామభద్ర ఆయుర్వేద మూలికా యోగ పీఠం ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు ఆయుర్వేద ఇమ్యూనిటీ చుక్కల మందు "స్వర్ణ బిందుప్రాసన" చుక్కల మందును ఉచితంగా అందిస్తున్నందుకుగాను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ బాధ్యులు విశ్వనాధుల పాపాచారి, కన్నోజు గురుబ్రహ్మం, పమ్మి వెంకటేశ్వరరావు,శ్రీ విశ్వ జ్యోతిర్లింగ పీఠం,ఖమ్మం పీఠాధిపతులు బ్రహ్మర్షి రామడుగు నరసింహాచార్య స్వామి, నాగలక్ష్మి , వజ్రాల కిరీటి చారి, రామడుగు ఆదిశేషు, సరికొండ మణిభూషణాచారి, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి: జాయింట్ కలెక్టర్ అధితి సింగ్

వైయస్సార్ కడప జిల్లా, నవంబర్ 17(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తోపాటు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జిలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు : కడపకు చెందిన జి. నాగరత్నమ్మ ఇది వరకు నాకు పింఛన్ వచ్చేదని గత మూడు సంవత్సరాలనుండి పింఛన్ రావడంలేదు పింఛన్ ఇప్పించవలసిందిగా కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు.



రైల్వే కొండాపురం మండలం ఏటూరు గ్రామానికి చెందిన పి. హరినాథ్ రెడ్డి తన కొడుకు మతిస్థిమితం లేని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలంటూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.

మైదుకూరు మండలం ఆదిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన రాజమ్మ మా గ్రామంలో 5.00 ఎకరాల భూమి ఉన్నది.ప్రభుత్వం వారు నాకు 1.68సెంట్లు కేటాయించినది సర్వే నెంబర్ ప్రకారం సబ్ డివిజన్ చేయవలినదిగా కోరుతూ అర్జీని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎస్డిసి వెంకటపతి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, భూగర్భ జల శాఖ,డి.డి. మురళీధర్, పర్యాటక శాఖ అధికారి సురేష్,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జి'హెచ్'ఎం'సి 'రోడ్లపై చెత్త 'గుంతలు తవ్వడం 'భవన నిర్మాణ వ్యర్థాలను ' నిషేధించాలి:నేదునూరి కనకయ్య

హైదరాబాద్, నవంబర్ 17(భారత శక్తి):



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వాల్ పోస్టల్స్ ' వాల్ రైటింగ్స్ నిషేధిస్తూ జి'హెచ్'ఎం'సి కమీషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేయడం స్వాగతించదగిన చర్య.

దీనితో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ సుందరీకరణే లక్ష్యంగాజిహెచ్ఎంసి ముందుకెళ్ళడం అభినందనీయం అని తెలంగాణ ఎకనామిక్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య అన్నారు .గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జిహెచ్ఎంసి పరిసరాల పరిశుభ్రత ' దోమల నివారణ మురికి వాడల అభివృద్ధి ' స్వచ్ఛత పచ్చదనం కార్యక్రమాల్లో పేదల భాగస్వామ్యాన్ని పెంచుతూ హైదరాబాద్ సుందరీకరణ యజ్ఞంలో సమాజంలోని అన్ని వర్గాలను స్వచ్ఛందంగా పాల్గొనేట్లు ప్రత్యేక కార్యాచరణ వ్యూహాన్ని అమలు చేయాలని తెలిపారు.


అనుమతి లేకుండా గోడలపై రాతలు రాసిన అంటించిన రాయించిన సంస్థలపై వ్యక్తులపై భారీ జరిమానాలు విధించడం హర్షణీయం అన్నారు.

నగరపరిధిలోని ఇంటి యజమానులు భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై వదలటం వల్ల రోడ్లు ఇరుకై రవాణాకు ఇబ్బంది కలిగిస్తున్నారు. చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు.మున్సిపాలిటీ నల్లా కనెక్షన్ల కొరకు పబ్లిక్ రోడ్డు తవ్వి వాటిని పూడ్చక పోవటం వల్ల వర్షా కాలంలో రోడ్లపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన సంఘటనలు జరిగాయని తెలిపారు.

వాల్ రైటింగ్స్ పాల్పడిన వారిపై విధించే కఠిన శిక్షలు జరిమానాలు పబ్లిక్ రోడ్స్ పై తవ్వకాలకు పాల్పడిన వారిపై భవన నిర్మాణ వ్యర్థాలను' చెత్తను ' రోడ్డు పై వేసిన వారికి డి 'జె వాడకందారులకు వర్తింప చెయ్యాలి. డి' జే సౌండ్స్ వాడకంపై నిషేధం విధించి శబ్ద కాలుష్యాన్ని అరికట్టాలి.ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వెయ్యాలి. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరస్థాయికి చేర్చడానికి కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దటానికి యుద్ధ ప్రాతిపదికన ఎం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ రేవంత్ రెడ్డి' హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్' జి'హెచ్'ఎం'సి కమిషనర్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 17: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి



సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అదనపు కలెక్టర్ లు విక్టర్, మదన్ మోహన్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆన్నారు.ఈ సందర్భంగా ప్రజావాణి లో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల పథకంనకు సంబంధించి వివిధ రకాల సమస్యలపై అర్జీలను స్వీకరించి అర్జీ దారుని యొక్క సమస్యలను వెంటనే పరిష్కరించి ఇళ్ల నిర్మాణాలకు తగు చర్యలు తీసుకోవాలని ఆన్నారు.ఆయా శాఖలకు సంబంధించిన దరఖాస్తులు విద్యా, వైద్యం, మిషన్ భగీరథ, విద్యుత్,డిడబ్ల్యుఒ, ఆర్ టి సి, భూభారతి, రెవెన్యూ కు సంబంధించిన వివిధ రకాల దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు ఈ సందర్భంగా తహసిల్దార్లతో మాట్లాడుతూ భూభారతీ, రెవెన్యు సదస్సులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని, అలాగే ఆయా మండలాల తహసీల్దార్లు వరి కొనుగోలు కేంద్రాలను ప్రతీ రోజు పర్యవేక్షించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రజావాణి కి 87 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఈ ప్రజావాణిలో ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలు సంఘటితంగా ఉండాలి : మాజీ జాతీయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఈగ మల్లేశం



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్17:

వరంగల్ ఖిలా వరంగల్ సమీపంలోని చింతల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రవేశ ద్వారం,వాకింగ్ మైదానంలో ప్రతీ సంవత్సరం మాదిరిగా జరిగే పద్మశాలీ కుల బంధువుల కార్తీక వనబోజనాల కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ జాతీయ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఈగ మల్లేశం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మీడియాతో మాట్లాడుతూ పద్మశాలీలు సంఘటితంగా ఐకమత్యంగా ఉండాలని కోరారు. వరంగల్ జిల్లాలో జరిగిన పద్మశాలీ కుల బంధువుల వనబోజనాల కార్యక్రమం విజయవంతమైందని ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కుల బంధువులు పాల్గొన్నారని వారిలో చైతన్యం వచ్చిందని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పద్మశాలీ చేనేత కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు,ముడి పదార్థాలు, జిఎస్టీ అందటం లేదని,జిఎస్టీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయాలని కోరారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ జిల్లాలో టెక్స్టైల్ పార్కు ఉందని,నిరుద్యోగులకు ఉపాధి కోసం టెక్స్టైల్ డిజైనరి ఇంజనీరింగ్ కాలేజీ ని వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరతామని తెలిపారు.

అనంతరం తులసీ,ఉసిరి చెట్టుకు పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడేపు రవీందర్,స్టేట్ వైస్ ప్రెసిడెంట్,కో కన్వీనర్ వడ్నాల నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం జ్యోతి ప్రజ్వలన, గణపతి పూజ, శ్రీ భక్త మార్కండేయ స్వామి పూజ, తులసీ ధాత్రి సహిత లక్ష్మీ నారాయణ పూజ,ఉసిరి చెట్టు పూజ,రుద్రాభిషేకం అనంతరం సామూహిక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు,సాయంత్రం కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం పంచ మహా హారతులతో ముగింపు కార్యక్రమం నిర్వహించారు.పద్మశాలీ కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కుసుమ సతీష్,ఆడేపు వెంకటేష్,ప్రముఖ గ్రానైట్ అధినేత ములుక రాజు,పద్మశాలీ సంఘం నేత మేరుగు అశోక్,పద్మశాలీ సంఘం కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (భారత శక్తి): సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో



నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్, అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఖాళీ అవుతున్న బిఆర్ఎస్ పార్టీ,
# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్న బిఆర్ఎస్ కార్యకర్తలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 17: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లింగంపేట మండలం పోల్కంపేట్ బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రమేష్, ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తనను ఆకట్టుకున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో ప్రేరణనిచ్చాయని రమేష్ పేర్కొన్నారు.

గత ప్రభుత్వ ఎమ్మెల్యేతో పోల్చితే, ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎంతో విస్తృతంగా, ప్రజల జీవితాలను మార్చే విధంగా ఉన్నాయని ఆయన ప్రత్యేకంగా తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం, ఉచిత కరెంటు, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయి అని అన్నారు. గతంతో పోల్చుకుంటే ఎన్నడూ లేని విధంగా పోల్కంపేట్ గ్రామంలో అభివృద్ధికి నాంది పలికింది. ఎమ్మెల్యే మదన్ మోహన్ వచ్చిన తర్వాతే గ్రామం నిజమైన అభివృద్ధి దిశగా అడుగులు వేసిందని రమేష్ పేర్కొన్నారు.


కాంగ్రెస్ కుటుంబంలోకి రమేష్ ని ఆహ్వానిస్తూ, ఎమ్మెల్యే మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీలోకి రమేష్ చేరిక హర్షణీయం అని ఆయన అన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే
## - జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 17:

జిల్లా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు, సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి / గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, సమస్యలు తలెత్తడానికి గల కారణాలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓ లతో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు చేయడంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకూడదని, ప్రతి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయాలని సూచించారు. సివిల్ తగాదాల్లో పోలీసు అధికారులు జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకనప్పుడు, మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా



నేరుగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదు పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## రసాయన శాస్త్రంలో నీరజ వడగంకు పీహెచ్డీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 17:

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని నీరజ వడగం డాక్టరేట్ కు



అర్హత సాధించారు. 'లిక్విడ్ క్రోమాటోగ్రఫీని ఉపయోగించి ఫార్మాస్యూటికల్ డోసేజ్ ఫారమ్ లలో చిరల్ మలినాలను వేరు చేయడం, పరిమాణాత్మక అంచనా వేయడం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు హరిదాస్యం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ నీరజ పరిశోధన ఔషధ విశ్లేషణాత్మక శాస్త్రానికి విలువైన సహకారాన్ని అందిస్తోంది. ఆమె కీలక ఔషధాలలో చిరల్ మలినాల యొక్క స్టీరియో-సెలెక్టివ్ విభజన, పరిమాణీకరణ కోసం బలమైన, స్థిరత్వాన్ని సూచించే క్రోమాటోగ్రఫీ పద్ధతులను అభివృద్ధి చేశారు. ఇది ఔషధ సూత్రీకరణలలో మెరుగైన నాణ్యత, భద్రతను నిర్ధారిస్తుంది. డాక్టర్ నీరజ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అనంతారం రైతులకు న్యాయం చేయండి
## – బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి
## – ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

గుమ్మడిదల భారత శక్తి ప్రతినిధి నవంబర్ 17 :

సంగారెడ్డి జిల్లా అనంతారం గ్రామ రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతారం గ్రామ సర్వే నెంబర్ 173, 174 భూములను ఇటీవల ప్రభుత్వ భూములుగా నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రావిణ్యకు ఈ భూములపై పూర్తి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న పట్టా భూములను ఒక్కసారిగా ప్రభుత్వ భూములుగా గుర్తించడం సరైన విధానం కాదని తెలిపారు. రైతులు పలుమార్లు దరఖాస్తులు సమర్పించినా అధికారులు స్పందించకపోవడం తీవ్రమైన అన్యాయం అని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని భూములను తిరిగి రైతుల పేర్లకే నమోదు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దశాబ్దాలుగా రైతులే సాగు చేస్తున్న భూములను ప్రభుత్వ భూములుగా మార్చడం అన్యాయం అని గోవర్ధన్ రెడ్డి అన్నారు. బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రజాపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.



# భారత భవిష్యత్తు నిర్మాణానికి - పాఠశాల స్థాయిలో కెరీర్ మార్గదర్శకత్వం కీలకం."

====================================

ప్రతి సంవత్సరం భారత్‌లో లక్షలాది విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఉత్సాహంగా ఉండాల్సిన సమయంలో, ఏ దిశగా వెళ్లాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదుదేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, మరియు యువత భవిష్యత్తుపై ప్రభావం చూపే ఒక ముఖ్యమైన సామాజిక సమస్య కూడా.

తాజా భారతీయ అధ్యయనాలు, అలాగే అంతర్జాతీయ సంస్థల నివేదికలు సూచిస్తున్నవి ఏమిటంటేమన విద్యార్థులు చాలా చిన్న వయసులోనే కెరీర్ నిర్ణయాలను ఒత్తిడిలో తీసుకుంటున్నారు. 8వ నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ఈ గందరగోళం అత్యంత ఎక్కువగా కనిపిస్తోంది.

సమస్య ఎక్కడుంది? %–% అధ్యయనాలు చెప్పే నిజాలు:

భారత విద్యార్థుల్లో చాలా శాతం మంది తమ ఆసక్తులు, అభిరుచులు, నైపుణ్యాలు ఏమిటో తెలుసుకోకుండానే, కుటుంబం లేదా సమాజ సూచనల ఆధారంగా "సేఫ్ కెరీర్" అని భావించే రంగాలను ఎంచుకుంటున్నారు.

ఎకనామిక్ సర్వే 2023%–%24 ప్రకారం, భారత పట్టభద్రుల్లో కేవలం 51.25% మాత్రమే ఉద్యోగాలకు సిద్ధంగా ఉన్నారు.

ILO (International Labour Organization) విడుదల చేసిన India Employment Report 2024 ప్రకారం,

"భారత యువతలో చదువు%–%నైపుణ్యం%–%ఉద్యోగాల మధ్య గణనీయమైన అసమతుల్యత కారణంగా, చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎక్కువగా కనిపిస్తోంది."

ఇది విద్యార్థులు తమ ఆసక్తులకు సరిపోయే కెరీర్‌ను ముందుగానే గుర్తించలేకపోవడం వల్ల జరుగుతోందని నివేదిక సూచిస్తుంది.

UNESCO ప్రకారం....

"కెరీర్ గైడెన్స్ అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఏ దశలో అయినా సరైన విద్యా, ఉద్యోగ నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన కీలక సేవ."

OECD 2024 నివేదిక ప్రకారం....

"స్కూల్ దశలో కెరీర్ కార్యకలాపాల్లో పాల్గొన్న విద్యార్థులు, పాల్గొనని విద్యార్థుల కంటే మంచి ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం ఎక్కువ."

అంటే విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కెరీర్ మార్గదర్శనం నిర్లక్ష్యం చేయలేని అంశమని వెల్లడిస్తోంది.

భారత భవిష్యత్తుపై ఈ సమస్య ప్రభావం:

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. కానీ యువతలో చాలామంది సరైన కెరీర్ సమాచారము లేకపోవడం వల్ల తమ ప్రతిభకు సరిపోని రంగాల్లోకి వెళ్తున్నారు.

ఇది మూడు ప్రధాన ప్రభావాలు చూపుతోంది:

1. ప్రతిభ వృథా అవ్వడం:

డిజైన్ అంటే ఇష్టపడే విద్యార్థి కుటుంబ ఒత్తిడితో ఇంజినీరింగ్ తీసుకుంటాడుబీ తర్వాత అసంతృప్తి, ఒత్తిడి అనివార్యం.

2. ఉద్యోగ మార్కెట్‌లో అసమానత:

పరిశ్రమలకు ఒక విధమైన నైపుణ్యం అవసరం, కానీ విద్యార్థులు వేరే రంగాల్లో చేరుతున్నారు.

ILO నివేదిక ప్రకారం, "యువతలో ఉన్న నిరుద్యోగం లో పెద్ద శాతం చదువుకున్నవారే."

3. దేశ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం:

నైపుణ్య లోపం వల్ల పరిశ్రమలకు సరైన మానవ వనరులు దొరకకపోవడం, దేశ అభివృద్ధిని మందగింపజేస్తుంది.

పరిష్కారాలు – సరైన దిశలో అడుగు

1. స్కూళ్లలో 8వ తరగతి నుంచే కెరీర్ మార్గదర్శనం

పర్సనాలిటీ అంచనా పరీక్షలు

ఇండస్ట్రీ విజిట్స్

మెంటర్ షిప్ సెషన్లు

కొత్త రంగాలపై అవగాహన

UNESCO పేర్కొన్నట్లుగా, "సమగ్ర కౌన్సిలింగ్ విద్యార్థుల జీవిత నిర్ణయాల్లో నమ్మకాన్ని పెంచుతుంది."

2. పాఠ్యాంశంలో కెరీర్ ఎక్స్‌ప్లోరేషన్ భాగం

AI, రోబోటిక్స్, రిన్యూవబుల్ ఎనర్జీ, డిజిటల్ ఆర్ట్స్, ఫైనాన్స్, సైకాలజీ వంటి రంగాలను విద్యార్థులకు పరిచయం చేయాలి.

OECD ప్రకారం, "వృత్తి అన్వేషణ చిన్న వయసులోనే ప్రారంభమైతే ఉత్తమ ఫలితాలు వస్తాయి."

3. తల్లిదండ్రుల పాత్ర

పిల్లల ఆసక్తులను అర్థం చేసుకొని, గౌరవించాలి. "అందరూ ఇదే చేస్తున్నారని" పిల్లలపై ఒత్తిడి సృష్టించకూడదు.

4. విద్యార్థుల పాత్ర

వర్క్‌షాప్స్, ఇంటర్న్‌షిప్స్, క్లబ్బులు, ప్రాజెక్టుల్లో పాల్గొని తమకు నిజంగా ఏ రంగం నచ్చుతోందో తెలుసుకోవాలి.

5. ప్రభుత్వ పాత్ర

NEP-2020 కెరీర్ గైడెన్స్‌ను ప్రాధాన్యతగా పేర్కొన్నా, అమలు దేశవ్యాప్తంగా బలపడాలి.


ILO, UNESCO కూడా ప్రభుత్వ–పాఠశాల భాగస్వామ్యం కెరీర్ అవగాహనకు కీలకం అని సూచిస్తున్నాయి.

భారత యువతకు అత్యంత అవసరమైనదిసమయానికి సరైన కెరీర్ అవగాహన మరియు శాస్త్రీయ మార్గదర్శనం.

ప్రతి విద్యార్థి తన ప్రతిభ, ఆసక్తులకు సరిపడే దారిని ఎంచుకునే హక్కు కలిగి ఉంది.


పాఠశాలలు–తల్లిదండ్రులు–ప్రభుత్వం–సమాజం కలిసి పనిచేస్తే, ఈ కెరీర్ గందరగోళం తగ్గి, దేశానికి ఆత్మవిశ్వాసమున్న, నైపుణ్యాలతో నిండిన, భవిష్యత్తును నిర్మించగల యువత సిద్ధమవుతుంది.

జైనుద్దీన్ మహ్మద్
Certified Career Analyst and
Counsellor of International studies.
website: www.nextgencareerguide.com
Ph: 9392418552
Mail:; nextgencareerguide@gmail.com



# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి 06 రోజుల జైలు శిక్ష

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు - జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 17 (భారత శక్తి ):నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన షేక్ ఆయుబ్ అనే వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పోలీసులు పట్టుబడాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరువరిచారు. సోమవారం విచారణలో రెండవ తరగతి మేజిస్ట్రేట్ ప్రత్యేక న్యాయమూర్తి నర్సయ్య నిందితునికి మోటార్ వాహనాల చట్టం ప్రకారం 06 రోజుల జైలు శిక్ష విధించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల మాట్లాడుతూ "మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరం. అలాంటి వారికి కఠిన చర్యలు తప్పవు.ప్రమాదకరంగా వాహనాలు నడిపి తమతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే వ్యక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 17:

ప్రజల ఆరోగ్య సహాయార్థం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముందుకు వచ్చారు. సదాశివపేట్ కు చెందిన తాహీరా బేగం అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబానికి చికిత్స ఖర్చుల భారం తగ్గించేందుకు ఎల్ ఓ సి ను వారి కుమారుడు హర్షద్ కు ఎమ్మెల్యే అందజేశారు.బాధితులు ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో వారి కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి అవసరమైన ఆర్థిక సహాయం అందే విధంగా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజలకు ఏ కష్టం వచ్చినా మా సహాయం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పుస్తకాల పఠనాన్ని అలవాటు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

## గ్రంథాలయంలో క్విజ్, వ్యాస రచన పోటీలు , జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు విశేష స్పందన





సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి,నవంబర్ 17 :58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య సారథ్యంలో సోమవారం క్విజ్ , వ్యాస రచన పోటీలను సందడిగా నిర్వహించారు. గ్రంథాలయ శాస్త్రం, పుస్తక పఠన ప్రాధాన్యం, చదివే అలవాటు పెంపు, ఉత్తమ చదువరి ప్రోత్సాహకం వంటి విషయాలపై విద్యార్థులను ప్రోత్సహిస్తూ పోటీలు నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , సరస్వతి దేవి, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాలకు పుష్పమాలలు అర్పించి, అనంతరం గ్రంథాలయ ప్రతిజ్ఞతో వారోత్సవాల ప్రారంభోత్సవాన్ని ప్రారంభించారు.వారి అధ్వర్యంలో గ్రంథాలయ ప్రతిజ్ఞ తో కార్యక్రమం ప్రారంభం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రంథాలయంలో లభించే అన్ని రకాల పుస్తకాలను చిన్నారుల నుండి సీనియర్ సిటిజెన్స్ వరకు అందరూ చక్కగా వినియోగించుకోవాలని తెలిపారు.ముద్రిత గ్రంథాలతో పాటు డిజిటల్ గ్రంథాలయాలు ఆధునిక కాలంలో అత్యంత ప్రాముఖ్యమని, వాటిని అభివృద్ధి చేయడానికి సి.యస్.ఆర్ నిధుల సహకారం అందించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.గ్రంథాలయం అందిస్తున్న సేవలు, పాఠకుల అవసరాలు, అభివృద్ధి చేయవలసిన అంశాలపై వివరణాత్మకంగా గ్రంథాలయ అధికారులను అడిగితెలుసుకున్నారు.పోటీల్లో పాల్గొన్న వివిధ విద్యాసంస్థల విద్యార్థులను అభినందించిన కలెక్టర్, పోటీ పరీక్షల పుస్తకాలు మాత్రమే కాకుండా నవలలు, సాంస్కృతిక గ్రంథాలు, అకాడమీ పబ్లికేషన్లు, పత్రికలు తదితరాలను చదివే మంచి అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శ్రీనివాస్, ప్రశాంత్, శోభారాణి, వరలక్ష్మీ, సావిత్రి, కృష్ణమూర్తి, నాగరాజు తదితరులతో పాటు అనేకమంది పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సూర్యాపేట ప్రెస్ క్లబ్ పూర్తిస్థాయి కమిటీ ఏకగ్రీవం



సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 17:

సూర్యాపేట ప్రెస్ క్లబ్ పూర్తిస్థాయి కమిటీ ని సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిరుమల గ్రాండ్ హెూటల్ లో సభ్యులందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా నాయిని శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శిగా కందుకూరి యాదగిరి, కోశాధికారిగా చర్లపల్లి గిరీష్ కుమార్,సీనియర్ ఉపాధ్యక్షులుగా సుంకరబోయిన వెంకటయ్య లను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం తెలిసిందే.వీరితో పాటు ఈ రోజు సోమవారం పూర్తి స్థాయి కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా పాల్వాయి జానయ్య, పల్లె మణి బాబు, పొట్టెపాక సైదులు.గౌరవ సలహాదారులుగా మానుకొండ రాము, ధూపాటి శ్యాంబాబు, టేకుల సుధాకర్,గుంటి శ్రీనివాస్, మామిడి రవి,దుస్సా చంద్రశేఖర్.ఉపాధ్యక్షులుగా లింగాల సాయి గౌడ్, దుర్గం బాలు,నందిపాటి సైదులు, కొరివి సతీష్ యాదవ్, గుడపూరి ప్రభాకర్ (ప్రభు), దేశ గాని వెంకట్ గౌడ్.సహాయ కార్యదర్శిలు నజీర్ ఖాన్, యోయో టీవీ శంకర్,దుర్గం సుమన్, బచ్చలకూరి వెంకన్న, కాటం గౌడ్, వల్దాసు శంకర్.ప్రచార కార్యదర్శులుగా మహమ్మద్ గౌస్, మామిడి సైదయ్య, తాప్సి అనిల్, కొమ్మ గాని సైదులు గౌడ్, చందుపట్ల శ్రీకాంత్, కుంచం రాంబాబు.కార్యవర్గ సభ్యులుగా యాతాకుల మధుసూదన్,మామిడి వెంకట్, తిరుపతి శ్రీనివాస్, కొండ రవి, అబ్దుల్ అజీజ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# హౌసింగ్ బోర్డ్ కాలనీకి మిషన్ భగీరథ వాటర్ కనెక్షన్ ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 17: కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, బృందావన్ కాలనీ, కౌండిన్య కాలనీ, జి ఆర్ కాలనీ లకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రేణుక మాట్లాడుతూ, హౌసింగ్ బోర్డ్ కాలనీ,బృందావన్ కాలనీ, కౌండిన్య కాలనీ, జి ఆర్ కాలనీలకు మిషన్ భగీరథ మంచినీటి సౌకర్యం లేకపోవడం వల్ల బోరు నుండి వచ్చే ఫ్లోరైడ్ వాటర్ తాగడం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. అదేవిధంగా బోరు నుండి వచ్చే నీరు అపరిశుభ్రంగా ఫ్లోరైడ్ శాతం ఎక్కువ ఉండడం వల్ల పక్షవాతం జుట్టు రాలిపోవడం ఇన్ఫెక్షన్లు వచ్చి అక్కడి ప్రజలు రోగాల పాలవుతున్నారని కావున వెంటనే మిషన్ భగీరథ ద్వారా కనెక్షన్ అందించి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్, కే. సత్యం తదితరులు పాల్గొన్నారు.



# సోయా రైతుకు తప్పని తేమ కష్టాలు.

## "సోయా రైతును మళ్లీ ముంచారు!

"విక్రయించిన పంట వాపస్..

" పంటను తిరిగి పంపుతున్న నాఫెడ్

" ఇప్పటికే కుంటాలకు చేరిన రెండు లారీలు

"అధికారులు నాణ్యత పరీక్షించి, గోదాములకు పంపినా అంగీకరించని వ్యాపారులు

"20శాతం కోతకు సరే అంటే దించుకుంటామని పట్టు






ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (భారత శక్తి): కుంటాల వ్యాపారులు సోయపంట రైతులను మరోసారి నిలువుగా ముంచారు. రెండు నెలలపాటు కంటికి రెప్పలా సోయ పంటను కొనుగోలు కేంద్రంలో పోసి నాణ్యత ప్రమాణాల ప్రకారం తూకం వేసి, గోదాములకు తరలిస్తే.. సోయవం టను నిలువ చేసుకోవాల్సిన నాఫెడ్ అధికారులు ప్రభుత్వం కొన్న సోయపంట నాసిరకం అంటూ తిరిగి కొనుగోలు కేంద్రాలకు వాపాస్ పంపడం చర్చనీయాంశంగా మారింది. అసలే ఆలస్యంగా ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా ల్లో రైతులు సోయ పంటను అమ్మారు. తూకం వేసి గోదా ములకు తరలిస్తే ఈ పంట మాకొద్దు అంటూ వ్యాపారులు సోయ బ్యాగులను వెనక్కి పంపుతున్నారు. నిర్మల్ జిల్లాలో సుమారు లక్ష ఎకరాలు సోయపంట సాగు చేయగా ప్రభుత్వం పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం రూ. 5,310 మద్దతు ధర నిర్ణయించగా..ప్రైవేట్లో రూ.4,200 కి కొంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ధరకు అమ్మేందుకు రైతులు కొనుగోలు కూపన్ల కోసం పడరా న్ని పాట్లుపడ్డారు. కూపన్ అందిన తర్వాత కొనుగోలు కేంద్రా ల్లో తేమశాతం పరిశీలించి, నాణ్యతగా ఉందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గుర్తించిన తర్వాతే కొన్నారు. పంటను కొనుగోలు చేసి నాఫెడ్ సంస్థకు లారీల్లో తరలించారు. ఇలా నిర్మల్ జిల్లాలో మార్ఫెడ్ ఆధ్వర్యంలో కుంటాల, కుబీర్, తానురు, భైంసా, ముధోల్, బాసర, సారంగాపూర్, నిర్మల్ మండలాల్లో కొనుగోలు చేసిన సోయను నాఫెడ్ గోదాములకు నిలువ ఉంచుకునేందుకు పంపారు. అక్కడ సోయా నాణ్యతగా లేదు అంటూ లారీలను తిప్పి పంపడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. నాలుగు రోజుల క్రితం కుంటాల సొసైటీకి చెందిన సోయా లారీలను గోదాముకు తరలిస్తే అక్కడి వ్యాపారులు సోయా పంట నాసిరకం అంటూ రెండు లారీలను తిరిగి పంపారు.

వంద కిలోలకు 20 కిలోలు తగ్గిస్తేనే సరి..

పంట పండించిన రైతులను అనేక విధాలుగా మోసం చేస్తున్న వ్యాపారులు ఇప్పుడు నాణ్యత పేరుతో కొనుగోలు చేసిన పంటలో కోత ఒప్పుకుంటేనే స్వీకరిస్తామంటూ మెలికలు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు తేమ శాతాన్ని పరిశీలించిన తర్వాతనే తూకం వేస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసి గోదాములకు పంపిన తర్వాత అది నాసిరకంగా ఉన్న దంటూ వ్యాపారులు మెలిక పెడుతున్నారు. 20శాతం నష్టా నికి ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తామని సొసైటీ అధికా రులకు, రైతులకు సమాచారం ఇస్తున్నారు. అంటే 100 కిలోల బస్తాను 80 కిలోలకు లెక్కించి డబ్బులు రైతు ఖాతాలో జమ చేస్తారు. వ్యాపారులు సిండికేట్గా మారి, తాము చెప్పిన డిమాండ్కు అంగీకరిస్తేనే దించుకుంటామని లేకపోతే వాపస్ తీసుకెళ్లాలని మొండికేస్తున్నారు. దీంతో లారీలు గోదాముల వద్ద రెండు మూడు రోజుల నుంచి నిలిచిపోవడం వల్ల రవాణా చార్జీలు భారంగా మారుతున్నాయి. ఈ చార్జీలు కూడా రైతులపైనే మోపుతున్నారు. గోదాములకు వెళ్లిన సోయపంట తిరిగి వస్తే రైతులు మళ్లీ ప్రైవేటు వ్యాపారులకు అమ్ము కోవాల్సి వస్తుంది. దీంతో రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లా మార్క్ఫెడ్ అధికారుల దృష్టికి రైతులు ఈ సమస్యను తీసుకెళ్లినా వారు చేతులు ఎత్తివేయడంతో తమ పరిస్థితి ఏం కావాలని ఆందోళన చెందుతున్నారు. అధికారు లు స్పందించి గోదాములకు తరలించిన సోయపంట తిరిగి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# కామారెడ్డి నూతన జిల్లా మత్స్య శాఖ ఇంచార్జి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె. డోలిసింగ్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 17: కామారెడ్డి నూతన జిల్లా మత్స్య శాఖ ఇంచార్జి అధికారిగా కె. డోలిసింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అశిష్ సాంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.ఇంతకు ముందు ఇక్కడ మత్స్య శాఖ అధికారిగా పని చేసిన పి. శ్రీపతి వరంగల్ , హన్మకొండలకు వర్క్ డిప్యూటేషన్ పై బదిలీ అయ్యారు.కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె. డోలిసింగ్ నిజాంసాగర్ లోని మత్స్య విత్తన క్షేత్రంలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం అదే మత్స్య విత్తన క్షేత్రానికి ఇంచార్జిగా కొనసాగుతారు.ఈ నియామకానికి సంబంధించి మత్స్యశాఖ డైరెక్టర్ డా. కే. నిఖిల, ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

# కాలుష్యంపై దోమడుగు గ్రామస్తుల కన్నెర్ర

## - కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన

## - హెటిరో పరిశ్రమపై చర్యలకు డిమాండ్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 17:



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామస్తులు పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై కన్నెర్ర చేస్తూ కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం ముందు బైఠాయించి పరిశ్రమలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న జల వాయు కాలుష్యంతో సాధారణ ప్రజలు పశుపక్షాదులు పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకారుల ఆందోళనలతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో పిసిబి అధికారులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని ప్రజలు తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు గ్రామస్తులు పిసిబి అధికారులపై కలుషిత జలాలను చల్లారు. నల్లకుంట చెరువు రసాయన నీళ్లతో ఎర్రగా మారిందని పరిశ్రమల యజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. స్థానిక హెటిరో పరిశ్రమ వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే పరిశ్రమను మూసివేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో దోమడుగు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రామానుజన్ గణిత ఒలంపియాడ్ 2024లో సత్తా చాటిన జయ

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 17:



రామానుజన్ గణిత అకాడమి రామచంద్రాపురం వారు నిర్వహించిన గణిత ఒలంపియాడ్ లో జయ స్కూల్ సూర్యాపేట నుండి 69 మంది విద్యార్థులు రెండవ లెవెల్ కు అర్హత సాధించారని కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. 5వ తరగతి నుండి 12 మంది విద్యార్థులు, 6వ తరగతి నుండి 8 మంది విద్యార్థులు, 7వ తరగతి నుండి 10 మంది విద్యార్థులు, 8వ తరగతి నుండి 12 మంది విద్యార్థులు, 9వ తరగతి నుండి 12 మంది విద్యార్థులు, 10వ తరగతి నుండి 15 మంది విద్యార్థులు అర్హత సాధించారని అన్నారు. పాఠశాలలో గణితం పై నిర్వహించే వివిధ కార్యక్రమాలు, వర్క్ షాపులు అత్యుత్తమ ప్రోగ్రామ్ ద్వారా టాలెంట్ టెస్టులలో విజయం సాధిస్తున్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను, తోడ్పడిన తమ ఉపాధ్యాయ బృందాన్ని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ ,డైరెక్టర్లు జెల్లా పద్మ బింగి జ్యోతి లు అభినందించారు.తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఓవరాల్ ఛాంపియన్స్ వరంగల్ బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్: చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు వెల్లడి



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్17:

వరంగల్ రంగశాయిపేట లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో సౌత్ ఇండియా స్పోర్ట్స్ మీట్ ముగింపు బహుమతుల కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించినట్లు బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాల చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా నడిపెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు రోజులుగా జరుగుతున్న సౌత్ ఇండియా స్పోర్ట్స్ మీట్ క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్స్ గా వరంగల్ బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడాకారులు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.ఈ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రాస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి హాజరై గెలుపొందిన క్రీడాకారులకు మెమెంటోలు,షీల్డులు,ట్రోఫీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కోచ్లు, క్రీడాకారులు,బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్,హుజురాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సరితా రెడ్డి,మొమిన్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ జయప్రకాశ్,పంచలి దాస్ శమిలా,రామకృష్ణా రెడ్డి, నిషా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎస్.పరంజ్యోతి, వివిధ పాఠశాలల డైరెక్టర్లు,కోచ్ లు,క్రీడాకారులు, తల్లిదండ్రులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్

సూర్యాపేట,భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 17:



ప్రజావాణి పిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని వారం రోజుల్లో ప్రజావాణి పిర్యాదుల స్టేటస్ పై సమీక్ష నిర్వహిస్తనని తెలిపారు.కోర్ట్ కేసులు ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే తదుపరి వాయిదా నాటికి కౌంటర్ పైల్ సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం అవసరం ఉంటే తెలియజేయాలనీ అలాగే ప్రభుత్వ కార్యాలయాల కి చెందిన భూముల వివరాలు రికార్డ్ లలో అప్డేట్ చేయాలని అన్నారు.జిల్లా స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి శాఖల వారీగా సమీక్షలు నిర్వహించాలని అలాగే పురోగతి పై నివేదికలు వెబ్ లింక్ ద్వారా ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు.నషా ముక్తా భారత్ అభియాన్ లో భాగంగా జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టుటకై ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని విద్యాసంస్థలలో అలాగే గ్రామ స్థాయి లో ప్రతిజ్ఞ చేపించాలని అధికారులను ఆదేశించారుబాల్య వివాహాలు రహిత తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణలి మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ తెలంగాణ 30 రోజులు (1నవంబర్-2025 నుంచి 1 డిసెంబర్ - 2025) ప్రత్యేక ప్రచారం సదస్సు లో భాగంగా బాల్య వివాహల నిర్మూలన అవగాహన కార్యక్రమం కి చెందిన పోస్టర్ అలాగే టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్ల ను కలెక్టర్ ఆవిష్కరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 24 దరఖాస్తులు,మున్సిపల్ కమిషనర్లకి 4,జిల్లా ఇరిగేషన్ అధికారికి 2,సోషల్ వెల్ఫేర్ అధికారికి 2,మిగిలిన 10 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని,మొత్తం 42 దరఖాస్తు లు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు , ఆర్డీఓ వేణు మాదవ్,మహిళా సంక్షేమ అధికారి కే. నర్సింహారావు, హౌజింగ్ పిడి సిధార్థ, ఇరిగేషన్ అధికారి,జడ్పీ డిప్యూటీ సి ఈ ఓ శిరీష, డి ఎస్ సి డి ఓ కే. దయానంద రాణి,డి పి ఓ యాదగిరి,డి ఈ ఓ ఆశోక్,డి ఐ ఈ ఓ బాను నాయక్,డి ఎం హెచ్ ఓ వెంకట రమణ,అధికారులు, సిబ్బంది, తదితరులు హాజరైనారు.

# ఫిర్యాదుదారుల నుండి- ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 17:



ఫిర్యాదుదారుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఫోన్ ద్వారా పోలీస్ అధికారులకు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ నరసింహా ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే/ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ఫిర్యాదిదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాది సమస్యను తెలుసుకుని పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు పరచడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, ప్రతి కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని పోలీస్ అధికారులకు లకు సూచించడం జరిగింది. గ్రీవెన్స్ డే ద్వారా వచ్చిన ఫిర్యాదుల స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఎస్పి అన్నారు.

# నది తీరాలకు, శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తజనం



కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో తెల్లవారజామున 4 గంటల నుండి గోదావరి నది తీరాలకు, శైవ క్షేత్రాలు భక్త జనం పోటెత్తారు. కార్తీకమాసం చివరి రోజు సందర్భంగా కార్తీక పౌర్ణమి నాడే కాకుండా, ఈ ఆఖరి రోజు మండలంలోని శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నేతిలో ముంచిన 365 వత్తుల దీపాలను పసుపు, కుంకుమలతో అలంకరించి గోదావరిలో వదిలారు. గోదావరి తీరం శివ, కేశవుల నామంతో పులకించింది. పరిసరాల్లో ఉన్న శైవ క్షేత్ర ఆలయాలు బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుండి భక్తుల దర్శనార్థం తెరిచి ఉంచారు. ఉదయం 4 గంటల నుండే శివ లింగాలను దర్శించుకునేందుకు భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. శివాలయాలలో పార్వతి పరమేశ్వరుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ముందుగా భక్తులు ధ్వజ స్తంభాల వద్ద పవిత్ర దీపాలను వెలిగించి దీప పూజలు, పరిసర ప్రాంతాల్లో ఉన్న రావి చెట్టు, జమ్మి చెట్టు, పుట్టల వద్ద గుడ్లు, పాలు పోసి, నువ్వులతో కలిపిన సలివిడిని నాగేంద్రుడికి నైవేద్యంగా సమర్పించారు. శివయ్యకు భక్తులు వెంట తీసుకు వచ్చిన పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వయంభుగా వెలసిన పాతాళ నిలకంఠేశ్వర స్వామికి గర్భగుడిలో శివలింగానికి ఆలయ అర్చకులు రామచంద్రమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో శివలింగానికి అభిషేకం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బహుళ త్రయోదశిని పురస్కరించుకొని సాయంత్రం 6 గంటల సమయంలో అర్చకులు నందీశ్వరుడికి రుద్రాభిషేకం చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు శ్రీ నిలకంఠేశ్వర స్వామి ద్విలింగ దర్శనమిచ్చారు. భక్తులు ద్విలింగ స్వరూపుడిని దర్శించుకొని తరించి పోయారు. హరి హారసుతులకు ప్రీతికరమైన మాసం కావడంతో నెల రోజుల పాటు శివ నామస్మరణ, విష్ణు సహస్రనామ పారాయణలు చేస్తూ భక్తులు నియమ నిష్ఠలతో గడిపారు. ఈ పవిత్ర మాసంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం నేటితో ముగియనుండడంతో మళ్లీ ఏడాది పాటు ఈ వైభవం కోసం భక్తులు వేచి చూడనున్నారు.




# యోగ పోటీలో గురుకుల విద్యార్థులకు గోల్డ్

మణుగూరు, నవంబర్ 17 (భారతశక్తి): కరీంనగర్ జిల్లాలో ఈ నెల 15 నుంచి జరిగిన ఎస్.జి.ఎఫ్ రాష్ట్రస్థాయి యోగ పోటీలలో మణుగూరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినీలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్ 17 రిటమిక్ ఫెయిర్ కేటగిరీలో విద్యార్థులు ఎం.రమ్య బి.సహస్ర గోల్డ్ మెడల్ సాధించారు. గెలుపొందిన విద్యార్థినులను సోమవారం ప్రిన్సిపల్ రాణి, ఆర్.సి.ఓ అరుణ కుమారి వ్యాయామ ఉపాధ్యాయురాలు వైనాల కావ్య, సరస్వతి, సుజాత, సునీత అభినందించారు.

# సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి:

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాసరావు

మణుగూరు, నవంబర్ 17 (భారతశక్తి): సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సమరశీల పోరాటాల చరిత్ర గలిగిన సిఐటియు కరపత్రాన్ని ఇంటింటికి పంపిణీ చేశారు. ప్రతి షాపులో యజమానులకు వివరిస్తూ మహాసభలను జయప్రదం చేయాలని విరాళాలు సేకరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దెల శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రజలు, పుర ప్రముఖులు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. బొగ్గు ఉత్పత్తి ఉత్పాదికతలలో 11 డివిజన్ లలో అగ్రగామిగా వెలుగొందిన మణుగూరు సింగరేణి ఏరియా ప్రమాదంలో పడిందన్నారు.



సింగరేణిని పరిరక్షించేందుకు జిల్లా సిఐటియు మహాసభలలో సమరశీల పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిట్టల నాగమణి, ఐద్వా మండల కార్యదర్శి తోట పద్మ ,గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు కోంద్రు గౌరీ, సిఐటియు నాయకులు నైనారపు నాగేశ్వరరావు, బండారు సారిక, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మాదాసు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.




## తొలిసారిగా అమెరికాకు
# విమాన ఇంధనం



* **చెవ్రాన్ ప్లాంట్‌లో అంతరాయం వల్లే**
* **రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి 60,000 టన్నుల ఎగుమతి**

అమెరికాకు మనదేశం తొలిసారిగా విమాన ఇంధనాన్ని (ఏటీఎఫ్) ఎగుమతి చేసింది. అమెరికా (దక్షిణ కాలిఫోర్నియా)లోని అగ్రగామి సంస్థ చెవ్రాన్ రిఫైనరీలో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడటమే ఇందుకు కారణమని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఆ రిఫైనరీలో రోజుకు 2,85,000 బ్యారెళ్ల ఉత్పత్తి ఏటీఎఫ్ జరుగుతుంది. అక్కడ అంతరాయం వల్ల, మనదేశ అగ్రగామి సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ రిఫైనరీ నుంచి 60,000 మెట్రిక్ టన్నుల (4,72,800 బ్యారెళ్లు) ఏటీఎఫ్‌ను ప్రత్యేక ఓడ ద్వారా, అక్టోబరు 2829 తేదీల్లో జామ్‌నగర్ ఓడరేవు నుంచి పంపినట్లు కెప్లర్, ఎల్ఎస్ఈజీ డేటా, పరిశ్రమ వర్గాలను ఉటంకిస్తూ ఆ కథనం వెల్లడించింది. డిసెంబరు ప్రారంభంలో ఈ ఓడ లాస్ ఏంజెల్స్‌ను చేరే అవకాశం ఉంది. చెవ్రాన్ ప్లాంటులో మరమ్మతులు పూర్తయ్యే వరకు, విమాన ఇంధన లభ్యత పరంగా సమస్యలు కొనసాగొచ్చని యూఎస్ వెస్ట్ కోస్ట్ భావిస్తోంది.

* **2026లో అమెరికా నుంచి 2.2 మి.టన్నుల వంటగ్యాస్ దిగుమతి**
* **ఇరుదేశాల మధ్య ఒప్పందం**

వచ్చే ఏడాదిలో (2026) అమెరికా నుంచి 2.2 మిలియన్ టన్నుల వంట గ్యాస్ దిగుమతి కోసం భారత ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశీయ వార్షిక ఎల్పీజీ దిగుమతుల పరిమాణంలో ఇది 10 శాతానికి సమానం. పరిమాణం, కాలపరిమితి, ధరలపై అంగీకార షరతులతో భారత్ అమెరికా మధ్య కుదిరిన మొదటి అధికారిక, వాణిజ్య ఒప్పందం ఇదే. వచ్చే ఏడాది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) 48 అతిపెద్ద గ్యాస్ రవాణా ఓడల ద్వారా 2.2 మిలియన్ టన్నుల వంట గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటాయి. చెవ్రాన్, ఫిలిప్స్, టోటల్ ఎనర్జీస్ ట్రేడింగ్ ఎస్ఏ లాంటి దిగ్గజ సంస్థలు ఈ గ్యాస్‌ను సరఫరా చేస్తాయి. అమెరికాతో ఎల్పీజీ ఒప్పందం చేసుకోవడం చరిత్రాత్మక పరిణామమని చమురు మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. మనదేశ ఎల్పీజీ అవసరాల్లో 65 శాతాన్ని దిగుమతులే తీరుస్తున్నాయి. భారత్‌కు 31 మిలియన్ టన్నుల ఎల్పీజీ అవసరం ఉండగా.. 2024లో 20.4 మిలియన్ టన్నులను యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా నుంచి దిగుమతి చేసుకుంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్, అమెరికాల మధ్య వాణిజ్య అంతరాన్ని తరచు ఎత్తి చూపుతున్నందున, ఇంధన దిగుమతుల ద్వారా తగ్గించుకోవచ్చు. ఇందులో భాగంగానే ఎల్పీజీ ఒప్పందాన్ని చూడొచ్చు. 2025 తొలి అర్ధభాగంలో అమెరికా నుంచి మనదేశం రోజుకు సుమారు 2,71,000 బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంది. 2024లో ఇదే సమయంలో దిగుమతి చేసుకున్న 1,80,000 బ్యారెళ్లతో పోలిస్తే ఇది 51% ఎక్కువ.

* **వాణిజ్య ఒప్పందం తొలి భాగం పూర్తి కావొస్తోంది**

భారత్ అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో తొలి భాగం దాదాపు పూర్తి కావొస్తోందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. మన వస్తువులపై అమెరికా ప్రభుత్వం విధించిన 25% సుంకం సమస్యకు, ఈ ఒప్పందంలో పరిష్కారం లభించే అవకాశం ఉందని అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపడం లేదంటూ మరో 25 శాతాన్ని భారత్ ఉత్పత్తులపై అమెరికా విధించిన సంగతి

# జనవరిలో కొత్త ఐటీఆర్ ఫారాలు

దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలికేలా, దాదాపు 6 దశాబ్దాల 'పాత ఆదాయపు పన్ను చట్టం 1961' స్థానంలో 'కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025'ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 2026 ఏప్రిల్ 1 నుంచి ఇది అందుబాటులోకి రానుంది. దీని అమలుకు ముందే, ఈ కొత్త చట్టం కింద ఉన్న నిబంధనలతో ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) ఫారాలను వచ్చే జనవరి కల్లా నోటిఫై చేయనున్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్ రవి అగర్వాల్ తెలిపారు. పన్ను చెల్లింపు ప్రక్రియను సరళీకృతం చేయడంతో పాటు, వ్యాపార వర్గాలకు సంబంధించిన నిబంధనలను సరళతరం చేయాలన్నదే కొత్త పన్ను చట్టం లక్ష్యమని వివరించారు. కొత్త నిబంధనల రూపకల్పన ప్రక్రియ వేగంగా జరుగుతోందని, పన్ను చెల్లింపుదారులు తమ అంతర్గత వ్యవస్థలు, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్లలో కొత్త చట్టానికి అనుగుణంగా మార్పులు చేసుకునేందుకు వీలుగా తగినంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే.. జనవరి నాటికి కొత్త ఐటీఆర్ పత్రాలు అందుబాటులోకి




తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు 12న పార్లమెంటు 'కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025'ను ఆమోదించింది. ఆదాయపు పన్ను చట్టం కొత్త పన్ను రేట్లను నిర్ణయించదు. పన్ను చట్టాన్ని అర్థం చేసుకోవడంలో ఉన్న సంక్లిష్టతను తొలగించడం, నిబంధనలను సులభతరం చేయడం, పాత భాషను ఆధునికీకరించడం లాంటివి మాత్రమే చేస్తుంది. పాత చట్టంలో 819 సెక్షన్లు ఉండగా, కొత్త చట్టంలో 536 ఉన్నాయి. అధ్యాయాలు 47 నుంచి 23కు తగ్గాయి. పదాల సంఖ్య 5.12 లక్షల నుంచి 2.6 లక్షలకు పరిమితమయ్యాయి. సులభంగా అర్థం చేసుకునేందుకు 39 పట్టికలు, 40 సూత్రాలను కొత్త చట్టంలో చేర్చారు. దీనివల్ల పన్ను చట్టంపై మరింత స్పష్టత వస్తుందని సీబీడీటీ వెల్లడించింది.

**రిఫండు క్లెయిమ్‌లను విశ్లేషిస్తున్నాం:** ఆదాయపు పన్ను రిఫండులు కొంతమందికి జాప్యం అవ్వడానికి కారణాలను వివరిస్తూ.. కొన్ని రిఫండు క్లెయిమ్‌ల్లో 'తప్పుడు మినహాయింపులు లేదా అధిక మొత్తాల్లో క్లెయిం చేసినట్లు' గుర్తించామని రవి అగర్వాల్ తెలిపారు. వీటిపై పూర్తిస్థాయి విశ్లేషణ జరుగుతోందని వివరించారు. సరైన క్లెయింలను ఈ నెలాఖరు లేదా డిసెంబరులోగా పరిష్కరిస్తామని తెలిపారు. తక్కువ మొత్తం రిఫండులను ఇప్పటికే దాదాపుగా పూర్తి చేసినట్లు తెలిపారు. 'కొంతమంది పన్ను చెల్లింపుదారులు తప్పు, అసంపూర్తిగా రిటర్నులు దాఖలు చేసినట్లు గమనించాం. రిటర్నులను సరిచేసి, ఫైల్ చేయాలని వారికి సూచించినట్లు' వివరించారు. ఏప్రిల్ 1 నుంచి నవంబరు 10 వరకు ఆదాయపు పన్ను రిఫండ్‌లు గత ఏడాదితో పోలిస్తే సుమారు 18% తక్కువగా, రూ.2.42 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. రిఫండు కోసం క్లెయిం చేసుకుంటున్న వారు తగ్గడం, పన్ను శ్లాబుల్లో సవరణ ఇందుకు కారణమని అగర్వాల్ వివరించారు.

# గిల్ స్థానంలో ఎవరు?

కోల్‌కతా: మెడ గాయంతో ఇబ్బందిపడుతోన్న టీమ్‌ఇండియా శుభ్‌మన్ గిల్ దక్షిణాఫ్రికాతో శనివారం మొదలయ్యే రెండో టెస్టులో ఆడడం అనుమానంగా మారింది. అతడు తొలి టెస్టు సందర్భంగా రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో మూడు బంతులే ఆడి గాయంతో మైదానాన్ని వీడిన అతడు... రెండో ఇన్నింగ్స్‌లో అసలు బ్యాటింగ్‌కే రాలేదు. గిల్ ఆస్పత్రికి కూడా వెళ్లాల్సివచ్చింది. నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు అతడికి సూచించారు. గిల్ ఒకవేళ రెండో టెస్టుకు అందుబాటులో లేకపోతే అతడి స్థానంలో ఎవరు తుది జట్టులోకి వస్తారన్నది ఆసక్తికరం. ఆ స్థానం కోసం సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్‌ల మధ్య పోటీ ఉంది. సుదర్శన్ ఇప్పటివరకు లభించిన అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోలేకపోయాడు.



అతడు ఆశించినంతగా రాణించలేదు. ఇంగ్లాండ్ పర్యటనలో పరుగుల వేటలో వెనుకబడ్డ అతడు.. వెస్టిండీస్‌పై రెండో టెస్టులో వరుసగా 87, 39 పరుగులు చేశాడు. అయితే సుదర్శన్ దక్షిణాఫ్రికా ఎపై రెండు మ్యాచ్‌ల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. భారత్‌ఎ తరఫున నాలుగు ఇన్నింగ్స్‌ల్లో అతడు సాధించిన అత్యధిక వ్యక్తిగత స్కోరు 32 మాత్రమే. ఇటీవల ఆస్ట్రేలియా ఎతో అనధికార టెస్టులో పడిక్కల్ 150 పరుగులు చేశాడు. అయితే మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే మాత్రం సాయి సుదర్శన్‌నే తుది జట్టులోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డాడు. "గిల్ కోలుకోకపోతే రెండో టెస్టుకు అతడి స్థానంలో సుదర్శన్‌ను తీసుకోవాలి. భారత జట్టు ఒకవేళ ఆరుగురు బౌలర్లను (నలుగురు స్పిన్నర్లు, ఇద్దరు స్పిన్నర్లు) కొనసాగిస్తే.. ఈ ఒక్క మార్పు (గిల్ స్థానంలో సుదర్శన్) తప్ప జట్టంతా అలాగే ఉండాలి" అని చెప్పాడు.




# సాత్విక్ జోడీపై ఆశలు

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్ చిరాగ్‌శెట్టి జోడీ బరిలో దిగనుంది. మంచి ఫామ్‌లో ఉన్న సాత్విక్ చిరాగ్ జోడీ ఈ టోర్నీలో టైటిల్ సాధిస్తుందన్న అంచనాలు, ఆశలు ఉన్నాయి. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో




చాంగ్ చి లీ వీ (చైనీస్ తైపీ) జంటతో టాప్ సీడ్ సాత్విక్ చిరాగ్ జోడీ తలపడనుంది. పురుషుల సింగిల్స్ లీ యాంగ్ (చైనీస్ తైపీ)తో లక్ష్యసేన్, యొహానెస్ మార్సెలినో (ఇండోనేసియా)తో హెచ్.ఎస్.ప్రణయ్, లీ చియా హావో (చైనీస్ తైపీ)తో కిదాంబి శ్రీకాంత్, మాగ్నస్ జొహానెసెన్ (డెన్మార్క్)తో తరుణ్ మన్నెపల్లి, సామ్ యువాన్ (కెనడా)తో ఆయుష్‌శెట్టి, కెంటా నిషిమొటో (జపాన్)తో కిరణ్ జార్జ్ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో పెబ్రియానా కుసుమ మెలీసా పుస్పితసరి జంటతో గాయత్రి గోపీచంద్ ట్రీసా జాలీ జోడీ పోటీపడనుంది.

# ఇదేంటి గురూ!

* **కోచ్ గంభీర్‌పై తీవ్ర విమర్శలు**
* **టెస్టుల్లో టీమ్‌ఇండియా తిరోగమనం**

2011 వన్డే ప్రపంచకప్ గెలిపించడంతో పాటు అన్ని ఫార్మాట్లలో టీమ్‌ఇండియాను అగ్ర జట్టుగా నిలబెట్టి భారత క్రికెట్లోనే అత్యుత్తమ కోచ్‌గా గుడ్‌బై చెప్పాడు గ్యారీ కిర్‌స్టన్. ఆ తర్వాత రవిశాస్త్రి రెండు దఫాలుగా సుదీర్ఘ కాలం భారత జట్టుకు కోచ్‌గా పని చేశాడు. మధ్యలో ఓ ఏడాది పాటు కుంబ్లే బాధ్యతలు నిర్వర్తించాడు. రవిశాస్త్రి తర్వాత ద్రవిడ్ జట్టును నడిపించాడు. కానీ వీళ్లందరి హయాంలో టీమ్‌ఇండియా మెరుగైన ప్రదర్శనే చేసింది. సచిన్ సహా దిగ్గజాల నిష్క్రమణ తర్వాత సంధి దశను అధిగమించాల్సి వచ్చినపుడు తప్పితే భారత్ పెద్దగా ఇబ్బంది పడలేదు. కోహ్లి, కుంబ్లేల మధ్య విభేదాలు తలెత్తిన సమయంలోనూ జట్టు ప్రదర్శన ఏమీ దెబ్బ తినలేదు. కానీ ఇప్పుడు గంభీర్ హయాంలో మాత్రం టీమ్‌ఇండియాకు ఊహించని పరాభవాలు ఎదురవుతున్నాయి. తన నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. కోచ్ పాత్రపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఇవిగో వైఫల్యాలు**

ఎంత మేటి జట్టుకైనా అప్పుడప్పుడూ ఒక ఓటమి ఎదురవడం సహజమే. గంభీర్ కోచ్ కావడానికి ముందు కూడా టీమ్‌ఇండియా ఓటములు ఎదుర్కొంది. కానీ గంభీర్ కోచ్ అయ్యాక 14 నెలల కాలంలో భారత్‌కు పెద్ద షాక్‌లే తగిలాయి. ముఖ్యంగా టెస్టుల్లో జట్టు ప్రదర్శన ఆందోళనకరంగా మారింది. ఈ 15 నెలల్లో సొంతగడ్డపై బలహీన జట్లయిన బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లపై మాత్రమే టెస్టు మ్యాచ్‌లు గెలిచింది భారత్. నిరుడు న్యూజిలాండ్ చేతిలో స్వదేశంలో 03తో వైట్‌వాష్‌కు గురి కావడం భారత క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద మచ్చగా మారింది. 36 ఏళ్లుగా భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలవని కివీస్.. ఏకంగా టీమ్‌ఇండియాను వైట్‌వాష్ చేయడం పెద్ద షాక్. సొంతగడ్డపై 12 ఏళ్ల తర్వాత భారత్‌కు ఎదురైన సిరీస్ ఓటమి అది. ఆ పరాభవం అనుకోకుండా జరిగిందేమో అనుకుంటే.. ఇప్పుడు దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు మ్యాచ్ ఓడడంతో టీమ్‌ఇండియా ఆటతీరుపై అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. నిరుడు న్యూజిలాండ్ సిరీస్ అనంతరం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్.. అక్కడా సిరీస్ కోల్పోయింది. వరుసగా రెండుసార్లు ఆస్ట్రేలియాలో సిరీస్‌లు సాధించిన తర్వాత ఈసారి అక్కడ ఓటమి ఎదురైంది. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో మరీ ఘోరంగా 46 పరుగులకే కుప్పకూలడం.. తాజాగా దక్షిణాఫ్రికాపై 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక 93 పరుగులకే చేతులెత్తేయడం టెస్టుల్లో భారత జట్టు పతనానికి సూచికలు. ఇంగ్లాండ్‌లో మెరుగైన ప్రదర్శన చేయడం ఒక్కటే గంభీర్ వచ్చాక టెస్టుల్లో సానుకూలాంశం. అక్కడ కూడా చివరి టెస్టులో జట్టు అసాధారణ ప్రదర్శన చేయకపోతే సిరీస్ చేజారేదే. ఇక వన్డేల విషయానికి వస్తే.. 27 ఏళ్ల తర్వాత




శ్రీలంకకు సిరీస్ కోల్పోయింది గంభీర్ కోచ్ అయ్యాకే. ఇటీవలే ఆస్ట్రేలియాలోనూ భారత్ వన్డే సిరీస్ ఓడిపోయింది.

**నిర్ణయాలు వివాదాస్పదం**

జట్టు ప్రదర్శనను మించి.. సెలక్షన్, తుది జట్టు కూర్పు, పిచ్‌ల విషయంలో జట్టు విధానం గంభీర్ వచ్చాక తీవ్ర వివాదాస్పదం అవుతున్నాయి. జట్టులో కుర్రాళ్లకు పెద్ద పీట వేయాలన్న ఆలోచన మంచిదే అయినా.. ఈ క్రమంలో సీనియర్ల పట్ల గంభీర్ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది. టెస్టుల్లో జట్టుకు ఎన్నో ఏళ్లుగా గొప్పగా సేవలందిస్తున్న అశ్విన్, రోహిత్, కోహ్లి ఒకరి తర్వాత ఒకరు రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడానికి గంభీరే కారణమన్న ఆరోపణలున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును విజేతగా నిలిపిన రోహిత్‌ను తర్వాతి వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా తప్పించడం వివాదాస్పదమైంది. తన మాట వినే యువ కెప్టెన్ ఉండాలనే ఉద్దేశంతోనే గౌతీ ఈ నిర్ణయం తీసుకున్నాడనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# సినిమా



## వచ్చే ఏడాదే పెండ్లి

మెగా మేనల్లుడు, టాలీవుడ్ హీరో సాయి దుర్గా తేజ్ ఇవాళ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. సుప్రభాత సేవ తర్వాత బ్రేక్ దర్శనంలో పాల్గొన్నాడు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నో రోజులుగా తన పెండ్లిపై వస్తోన్న రూమర్లకు క్లారిటీ ఇచ్చాడు. వచ్చే ఏడాదిలో తన వివాహం జరుగుతుందని చెప్పుకొచ్చాడు. 'మంచి చిత్రాలు, మంచి జీవితం ఇచ్చిన భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు తిరుమల వచ్చాను. కొత్త సంవత్సరం వస్తున్న తరుణంలో శ్రీవారి ఆశీస్సులు కావాలని దర్శించుకున్నాను. వచ్చే ఏడాదిలో నేను నటించిన 'సంబరాల ఏటిగట్టు' విడుదలవుతుంది. మీరంతా ఆదరిస్తారని ఆశిస్తున్న' అంటూ పేర్కొన్నాడు. ఇక 'సంబరాల ఏటిగట్టు' విషయానికొస్తే..రోహిత్ కేపీ దర్శకత్వంలో కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతుంది. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్ గా నటిస్తోంది. వాస్తవంగా దసరాకు విడుదల కావాల్సిన ఈ మూవీ పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్‌ప్లాన్ చేస్తున్నారు. ఇది తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

# నచ్చితే ఓకే



చేసింది తక్కువ సినిమాలే అయినా స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది అమీషా పటేల్. బాలీవుడ్‌లో 2000లో కహో నా ప్యార్ హై సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తన అందం, స్క్రీన్ తో ఒక్కసారిగా స్టార్‌డమ్‌ను అందుకుంది. తెలుగులో పవన్ కళ్యాణ్ సరసన నటించిన బద్రి బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో ఆమె క్రేజ్ మరింత పెరిగింది. అయితే 'నాని', 'నరసింహుడు' చిత్రాలు డిజాస్టర్ కావడంతో ఆమెకు మళ్లీ తెలుగులో ఛాన్సులు రాలేదు. ఇక ఆమె వ్యక్తిగత జీవితం విషయానికొస్తే.. 50 ఏళ్ల వయసులో కూడా ఇప్పటి వరకు పెళ్లి చేసుకోకపోవడం, రిలేషన్‌షిప్ రూమ ఆమె తరుచూ వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన వయసు సగం ఉన్న కుర్రాళ్లు కూడా డేటింగ్‌కు పిలుస్తున్నారని, తాను ఇందుకు ఓపెన్‌గా ఉన్నానని చెప్పింది. నచ్చితే ఎప్పుడైనా పెళ్లికి రెడీ అని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె ఒక వ్యాపారవేత్తతో ప్రేమలో ఉందనే టాక్ నడుస్తుండగా, ఈ వ్యాఖ్యలు నెటిజన్లలో వైరల్ అవుతున్నాయి.

## 'ఫౌజీ'కి ప్రీక్వెల్



ప్రస్తుతం కథానాయకుడు ప్రభాస్ చిత్రమంటే రెండు భాగాలన్నది పరిపాటిగా మారిపోయింది. ఇప్పటికే ఆయన 'సలార్ 2', 'కల్కి 2' చిత్రాలు చేయాల్సి ఉంది. 'ది రాజాసాబ్'కి కూడా రెండో భాగం అవకాశముందని ఆ చిత్ర నిర్మాత ఇప్పటికే ప్రకటించారు. ఇప్పుడీ జాబితాలో 'ఫౌజీ' కూడా చేరనుంది. హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ప్రీక్వెల్ ఉంటుందని దర్శకుడు హను ఓ ప్రకటనలో తెలిపారు. ''ఈ చిత్ర తొలి భాగంలో ప్రభాస్ పాత్రకు సంబంధించి ఒక ప్రపంచాన్ని చూపిస్తున్నాం. రెండో భాగం తనలోని మరో కోణాన్ని అన్వేషిస్తుంది. మన గత వలస పాలన ప్రధానంగా ఈ ప్రీక్వెల్ ఉండనుందని.. వ్యక్తిగతంగా నాకు స్ఫూర్తినిచ్చిన కొన్ని నిజ జీవిత అనుభవాల్ని దానికి జోడించనున్నామ''ని చెప్పారు. దేశభక్తి అంశాలతో ముడిపడి ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో అలరించనున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది. ఇందులో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా.. జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## జంటగా మరోసారి?




సాయిపల్లవి ధనుష్‌లది వెండితెరపై విజయవంతమైన జోడి. వీళ్లిద్దరి నుంచి వచ్చిన 'మారి 2' సినిమా.. అందులోని ''రౌడీ బేబీ'' పాట ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. వీళ్లిద్దరూ ఇప్పుడు మరోసారి జంటగా మురిపించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ధనుష్ ప్రస్తుతం తన 55వ చిత్రం కోసం 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామితో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం కథానాయికగా సాయిపల్లవిని రంగంలోకి దించేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు జరిగినట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. సాయిపల్లవి ప్రస్తుతం హిందీలో 'రామాయణ' చిత్రంలో నటిస్తోంది. అలాగే 'మేరే రహో' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 50 ఇయర్స్ ఇండస్ట్రీ



అగ్ర హీరోలు రజనీకాంత్, బాలకృష్ణలకు అరుదైన గౌరవం దక్కింది. ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా వేడుకల్లో వీరిద్దరిని సన్మానించనున్నారు. నవంబర్ 20 నుంచి 28 వరకు గోవా వేదికగా ఈ ఫెస్టివల్ జరగనుంది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ వెల్లడించారు. 1975లో అపూర్వ రాగంగళ్‌తో సినీ రంగ ప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్నాడు. తాతమ్మ కల, రామ్ రహీం చిత్రాలతో 1974లో చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టిన బాలకృష్ణ ప్రస్తుతం వరుస విజయాలు అందుకుంటూ బిజీగా ఉన్నాడు. ఆయన నటించిన అఖండ2 రిలీజ్‌కు సిద్ధంగా ఉంది.



శివాజీ, నవదీప్, బిందు మాధవి

## కులం జీవితాలతో ఆడే ఆటలో..

"ప్రపంచంలో అన్నిటికంటే తక్కువ ఖర్చులో దొరికేది సినిమానే" అన్నారు నటుడు శివాజీ. అలాంటి సినిమా కోసం చాలా మంది కష్టపడి పని చేస్తున్నారని.. అందుకే దయచేసి అందరూ సినిమాల్ని థియేటర్లోనే చూడాలని, పైరసీని ప్రోత్సహించొద్దని కోరారు. ఇప్పుడు శివాజీ, నవదీప్, రవికృష్ణ ప్రధాన పాత్రధారులుగా మురళీకాంత్ తెరకెక్కించిన చిత్రం 'దండోరా'. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరు 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హీరో అడివి శేష్ ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శివాజీ మాట్లాడుతూ.. "ఐబొమ్మ పైరసీ సైట్ వల్ల తాను చాలా మందికి ఉపయోగపడుతున్నానని ఆ నిర్వాహకుడు అనుకున్నాడు. కానీ, ఎంతోమందిని ఇబ్బంది పెట్టాడు. మనకంటూ కొన్ని పద్ధతులున్నాయి. రాజ్యాంగం ప్రకారం బతకాలి. ఇప్పటికైనా అతనిలో మార్పు రావాలి. సినిమాని థియేటర్‌లో చూసిన అనుభూతి మరెక్కడా దొరకదు. మా 'దండోరా' మంచి కాన్సెప్ట్‌తో రూపొందింది. థియేటర్లలో చూసి ఆదరించండి" అన్నారు. "నేటికీ కులం అనేది ఎంతో మంది జీవితాలతో ఎలా ఆడుకుంటోందనేది ఈ చిత్రంతో చూపించనున్నాం. దీన్ని ఓ చావుతో ముడిపెట్టి ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఎలా చూపించామన్నది ఆసక్తికరం" అన్నారు నటుడు నవదీప్. దర్శకుడు మురళీకాంత్ మాట్లాడుతూ.. "మా టీజర్ నచ్చి.. అల్లు అర్జున్ ఫోన్ చేసి మెచ్చుకున్నారు. చాలా ఆనందంగా ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో బిందు మాధవి, రవికృష్ణ, నందు, మౌనిక రెడ్డి, రవీంద్ర బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ సాంకేతిక కాలేజీల అధ్యాపకుల పదవీవిరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచాలి

**: టీ.ఎస్.టి.సి.ఈ.ఏ.**

హైదరాబాద్, నవంబర్ 17 (భారత శక్తి) : రాష్ట్రంలోని ప్రైవేట్ సాంకేతిక విద్యా సంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీ.ఎస్.టి.సి.ఈ.ఏ.) రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.2025 జనవరి 28న విడుదలైన జీవోఎంఎస్ నం. 3 ప్రకారం ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపకుల వయోపరిమితిని 65 సంవత్సరాలకు పెంచినప్పటికీ, జేఎన్టీయూహెచ్ మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేట్ సాంకేతిక కళాశాలలు ఇంకా ఆదేశాలను అమలు చేయలేదని ఆయన తెలిపారు.ఈ ఆలస్యం వలన అనుభవజ్ఞులైన అధ్యాపకులు అన్యాయానికి గురవుతున్నారని సంతోష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో టీ.ఎస్.టి.సి.ఈ.ఏ. తరఫున రెండు విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సెలర్లు, రిజిస్ట్రార్లకు వినతిపత్రాలు పంపినట్లు ఆయన తెలిపారు.






జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ఇప్పటికే సానుకూలంగా స్పందించి, అధ్యాపకుల హక్కులను రక్షించే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంతోష్ కుమార్ వెల్లడించారు.అలాగే సాంకేతిక విద్యా నాణ్యతను పెంపొందించేందుకు క్యాడర్ రేషియో (1:2:6) అమలు తప్పనిసరిగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం అమలయితే అనుభవజ్ఞులైన అధ్యాపకులకు న్యాయం జరిగి, రాష్ట్రంలోని ప్రైవేట్ సాంకేతిక విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగుపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.



## మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత

**చిగురింత.నరసింహారెడ్డి పర్యటన**

బడంగ్పేట్, నవంబర్ 17: భారత శక్తి మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని కుర్మల్ గూడ మెగా డ్రీమ్ సిటీ కాలనీని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో జరుగుతున్న వాటర్ పైప్‌లైన్ మరియు రోడ్ల పనులను పరిశీలించారు.నరసింహారెడ్డి, గతంలో తీర్మానం చేసిన పనులు ఇంకా పూర్తికాలేదని గుర్తుచేశారు. ప్రజలకు మరింత ఇబ్బంది కలగకుండా వెంటనే పనులను పూర్తి చేయాలని డీఈఈ వెంకన్న గారిని కోరారు.ఈ పర్యటనలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా ఆక్రమణలు..

*** హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు**

హైదరాబాద్, నవంబర్ 17 (భారత శక్తి): నగరంలో ఎలా అనువుగా ఉంటే అలా కబ్జాలకు పాల్పడుతున్నారు. డెడ్ ఎండ్ కాలనీ అయితే, ఆ మర్గాన్ని కబ్జా చేసేయడం, పాత లే ఔట్‌లలో హద్దులు చెరిపేసి పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమణ, ఇలా అనేక ఫిర్యాదులు నగరం నలుమూలల నుంచి హైడ్రాకు అందుతున్నాయి. ఆఖరుకు ఆలయాలకు ఉద్దేశించిన స్థలాలు, పుణ్య స్నానాలు ఆచరించడానికి ఉద్దేశించిన కోనేరును కూడా కబ్జా చేసేస్తున్నారంటూ జగద్గిరిగుట్ట లోని శ్రీ గోవిందరాజు స్వామి దేవస్థానం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.కూకట్‌పల్లి ఎల్లమ్మబండ వద్ద ఉన్న ఎల్లమ్మకుంటలోకి ప్రగతినగర్ మురుగునీరు వచ్చి చేరుతోందని కాలువ మళ్లింపు పనులు త్వరగా జరిగేలా చూడడంతో పాటు, కుంట ఆక్రమణలను కూడా తొలగించాలని అక్కడి నివాసితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. శంషాబాద్ విలేజ్, ఆర్ఆర్ నగర్ అయ్యప్ప కాలనీలోని సర్వే నంబరు 748, 749లో పార్కుతో పాటు ప్రజావసరాలకు కేటాయించిన 4794 గజాల స్థలం కబ్జాకు గురైందని అక్కడి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.ఇలా నగరం నలుమూలల నుంచి సోమవారం ప్రజావాణికి మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. వీటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

**ఫిర్యాదులు ఇలా..**

* ప్రగతినగర్ చెరువు సరిహద్దులను అధికారికంగా సర్వే చేసి నిర్ధారించాలని ప్రగతినగర్ లేక్‌వ్యూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాను కోరారు. ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు వచ్చి సర్వేలు చేసి ఇష్టానుసారంగా హద్దులు నిర్ధారిస్తున్నారని.. ఇదేమని అడిగితే మాపై కేసులు నమోదు చేశారంటూ వాపోయారు. ఆ సరిహద్దుల్లోకి ప్రవేశించినా తమపై కేసులు పెడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి నేపథ్యంలో హైడ్రా చొరవ తీసుకుని హద్దులు నిర్ధారిస్తే స్థానికంగా ఎలాంటి వివాదాలు తలెత్తవని పేర్కొన్నారు.
* శేరిలింగంపల్లి మండలం సిలికాన్ కంట్రీలో 162 ప్లాట్లున్నాయి. ఇక్కడ 24 అడుగుల దారిని కూడా వదలకుండా దుకాణాలకు అక్కడ బిల్డర్లు అనుమతులివ్వడంతో ఆ దారి 16 అడుగులకు పరిమితమైందని సిలికాన్ కంట్రీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా.. ఇక్కడ క్లబ్ హౌస్ నిర్మించి తమ అపార్టుమెంట్‌కు సంబంధించిన స్థలంతో పాటు,ప్రభుత్వ స్థలాన్ని3320 గజాల వరకూ కాజేశారని నిర్మాణ సంస్థపై ఫిర్యాదు చేశారు.
* అంబర్‌పేట, గోల్నాకలోని శ్రీ వేంకటేశ్వర నగర్ బస్తీలో రహదారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి అటువైపు ఎవరూ వెళ్లడానికి కూడా వీలు లేకుండా చేస్తున్నారని, అక్కడ నివాస ప్రాంతాల్లో అనుమతి లేని వ్యాపారాలు చేసి నివాసితులకు ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా రహదారిపై వేసిన బారికేడ్లను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.
* మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ అల్వాల్ జొన్నబండ గ్రామం సర్వే నంబరు 21పి, 576పి, 577 లో 9.61 ఎకరాల మేర గంగా అవెన్యూ లో 2292 గజాల స్థలాన్ని పార్కుతో పాటు ప్రజావసరాలకు కేటాయించారు. అక్కడ ఆక్రమణలను హైడ్రా తొలగించింది. వెంటనే ఫెన్సింగ్ వేసి ఆ స్థలాన్ని కాపాడాలని ప్రజావాణి ఫిర్యాదులో అక్కడి నివాసితులు కోరారు.లేని పక్షంలో మరోసారి కబ్జాకు గురి అవుతుందని, వెంటనే పార్కుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అదే ప్రాంతంలోని అరవింద్ ఎన్‌క్లేవ్ కు వెళ్లే దారి నంబరు 4 ను అక్రమంగా కబ్జా చేసి అడ్డుగా గోడను నిర్మించారని, వెంటనే తొలగించాలని కోరారు.






## రాక్ అండ్ రోల్ క్లాత్ షోరూంను ప్రారంభించిన మధుయాష్కీ గౌడ్

ఎల్బీనగర్, నవంబర్ 17(భారత శక్తి): వనస్థలిపురం కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రాక్ అండ్ రోల్ క్లాత్ షోరూమ్ ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, సరికొత్త డిజైన్లతో వస్త్రాలను అందించినప్పుడు వారి నుంచి మంచి ఆదరణ పొందగలరని నిర్వాహకులు కిరణ్ గౌడ్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్జి భాస్కర్ యాదవ్,కుట్ల నర్సింహ యాదవ్, చెన్నగోని రవీందర్ గౌడ్,పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డా సత్యనారాయణ, స్వర్ణ మాధవి కంచర్ల కవిత, నాయకులు బొగ్గారపు వరుణ్, అనసూయ, అంతటి శ్రీనివాస్ గౌడ్, సాయి కిరణ్ గౌడ్, రేణు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్న ఆదేశాలు

**: కమిషనర్ ఆర్.వి. కర్నన్..**

హైదరాబాద్, నవంబర్ 17(భారత శక్తి): హెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 172 ఆర్జీలుహైదరాబాద్, నవంబర్ 17, 2025:జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను వేగంగా పరిష్కరించాలంటూ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించాడు. సోమవారం ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా కమిషనర్‌కు వినిపించారు.కమిషనర్ ప్రజావాణిలో వచ్చిన ప్రతి విన్నపాన్ని జాగ్రత్తగా పరిశీలించి, వెంటనే పరిష్కారానికి సంబంధిత విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశాడు.ప్రజల ఆర్జీలను నిర్లక్ష్యంగా వదిలేయరాదని అధికారులను హెచ్చరించాడు.




ఒకే సమస్యపై ప్రజలు పదేపదే రావాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించాడు.ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 67 విన్నపాలు, ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్ల నుండి మరో 105 అర్జీలు అందాయి. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 46, శేరిలింగంపల్లి జోన్‌లో 20,సికింద్రాబాద్ జోన్‌లో 18,ఎల్బీనగర్ జోన్‌లో 15, చార్మినార్ జోన్‌లో 5, ఖైరతాబాద్ జోన్‌లో ఒకటి నమోదు అయ్యాయి. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సత్యనారాయణ, వేణు గోపాల్, సిసిపి శ్రీనివాస్, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాములు, విజిలెన్స్ ఏఎస్పీ నర్సింహా రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్షమించండి.. మా సేవలు శాశ్వతంగా నిలిపివేశాం

హైదరాబాద్, నవంబర్ 17(భారత శక్తి) : ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టయిన నేపథ్యంలో ఐ బొమ్మ ఓ ప్రకటన విడుదల చేసింది. తమ సేవలను శాశ్వతంగా నిలిపివేశామని వెబ్‌సైట్లో వెల్లడించింది. కొత్త సినిమాలు, ఓటీటీ వేదికల్లోని కంటెంట్‌ను పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్రధాన నిందితుడు రవిని శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఐ బొమ్మ, దాని అనుబంధంగా ఉన్న 65 వెబ్‌సైట్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారు. ''మీకు ఇటీవల మా గురించి తెలిసి ఉండొచ్చు. లేదంటే.. మొదటి నుంచి నమ్మకమైన అభిమానై ఉండొచ్చు. ఏదేమైనా.. మీ దేశంలో మా సేవ శాశ్వతంగా నిలిపివేశామని చెప్పేందుకు చింతిస్తున్నాం. అందుకు క్షమాపణలు కోరుతున్నాం'' అని ఐ బొమ్మ ప్రకటనలో పేర్కొంది.
గత ఏడెనిమిదేళ్లుగా పైరసీ సినిమాలు, వెబ్‌సిరీస్‌లకు ఐ బొమ్మను వేదికగా మార్చిన ఇమ్మడి రవి (40)ని శనివారం సైబర్ క్రైమ్ పోలీసులు కూకట్‌పల్లిలో అరెస్ట్ చేశారు. ఇతడు నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో రూ.3 కోట్ల నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్కులు,



కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను గుర్తించినట్టు సమాచారం. నిందితుడిని బషీర్‌బాగ్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)కు తరలించి కీలక సమాచారం సేకరించారు. అనంతరం నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## హౌస్ ట్యాక్స్ రివైజ్ పేరుతో జరుగుతున్న అక్రమ తంతును వెంటనే ఆపాలి

* **బిజెపి కార్పొరేటర్ల డిమాండ్..**
* **రివైజ్ హౌస్ ట్యాక్స్‌లపై అక్రమాలు**
* **ప్రజల్లో ఆందోళన, అవినీతికి పాల్పడుతున్న అధికారులపై జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ చర్యలు తీసుకోవాలని కోరిన ఎల్బీనగర్ నియోజకవర్గ బి.జెపి కార్పొరేటర్లు...**

హైదరాబాద్, నవంబర్ 17(భారత శక్తి) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలో హౌస్ ట్యాక్స్ రివైజ్ పేరుతో జరుగుతున్న అనుచిత ఆచరణలు ప్రజల్లో ఆగ్రహాన్ని రేపుతున్నాయి. ఎల్బీనగర్ జోన్ పరిధిలో పన్ను సేకరణ సిబ్బంది అధిక ట్యాక్స్‌లు విధించడం, ప్రజలను భయపెట్టడం వంటి చర్యలపై తాజాగా బీజేపీ కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో హయత్‌నగర్



డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేతృత్వంలో బీజేపీ కార్పొరేటర్లు జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఇందులో "రివైజ్ హౌస్ ట్యాక్స్" పేరుతో సిబ్బంది ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారని, చిన్న చిన్న ఇళ్ళకు కూడా అనవసరంగా పన్ను పెంపు చేస్తున్నారని తెలిపారు.కార్పొరేటర్లు మాట్లాడుతూ,సరైన అధ్యయనం లేకుండా, ఫీల్డ్ సర్వే చేయకుండా ట్యాక్స్ అంచనాలు వేయడం ప్రజలకు భారమవుతోందని,సాధారణ కుటుంబాలు ఆర్థికంగా కష్టాల్లోకి నెట్టబడుతున్నాయని పేర్కొన్నారు.చిన్న వ్యాపారులు తమ ఇళ్ల ముందు పెట్టుకునే బోర్డులను కమర్షియల్‌గా వర్గీకరించి కమర్షియల్ ట్యాక్స్ విధించడం అన్యాయం అని వారు విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా హౌస్ ట్యాక్స్ నిర్వచనాలు మారి, పౌరులపై కొత్త భారాలు పడుతున్నాయని చెప్పారు.ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, ఉద్రిక్తతలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లిన కార్పొరేటర్లు, అక్రమాలకు పాల్పడుతున్నసిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, పాత ట్యాక్స్ రేట్లను పునరుద్ధరించి పారదర్శక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, చింతల అరుణ, సురేందర్ యాదవ్, నాయికోటి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జిహెచ్ఎంసి అధికారులు ప్రజా ఫిర్యాదులను గమనించి, అవసరమైతే రివిజన్ ప్రక్రియపై అంతర్గత సమీక్ష చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ప్రింట్ మీడియాకు శుభవార్త చెప్పిన కేంద్రం

ఢిల్లీ, నవంబర్ 17 (భారత శక్తి): ప్రింట్ మీడియా రంగానికి కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వార్తా పత్రికల్లో ప్రచురించే ప్రభుత్వ ప్రకటనల రేట్లను ఏకంగా 26 శాతం పెంచుతూ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు, కలర్ ప్రకటనలకు ప్రత్యేకంగా ప్రీమియం రేట్లను కూడా ప్రవేశపెట్టింది. ఈ నిర్ణయంతో పత్రికా రంగానికి ఆర్థికంగా చేయూత లభించనుంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, లక్ష కాపీలు ఉన్న దినపత్రికలకు బ్లాక్ అండ్ వైట్ ప్రకటనల రేటు చదరపు సెంటీమీటర్‌కు రూ. 47.40 నుంచి రూ. 59.68కి పెరిగింది. ఇతర మీడియా నుంచి వస్తున్న పోటీ, గత కొన్నేళ్లుగా పెరిగిన నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ప్రింట్ మీడియాకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని, తద్వారా నాణ్యమైన జర్నలిజం కొనసాగించడానికి, స్థానిక వార్తా సంస్థలకు మద్దతు ఇవ్వడానికి వీలవుతుందని కేంద్రం పేర్కొంది. మెరుగైన కంటెంట్‌పై పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రజా ప్రయోజనాలకు మరింత సమర్థవంతంగా సేవ చేయవచ్చని వివరించింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల ప్రచార కార్యక్రమాలను సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) నిర్వహిస్తుంది. చివరిసారిగా 2019 జనవరిలో ప్రకటనల రేట్లను సవరించారు. తాజా సవరణ కోసం 2021 నవంబర్‌లో 9వ రేట్ స్ట్రక్చర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (INS) వంటి వివిధ వార్తాపత్రికల సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను, న్యూస్‌ప్రింట్ ధర, ద్రవ్యోల్బణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 2023 సెప్టెంబర్‌లో తన సిఫార్సులను సమర్పించింది. ఈ సిఫార్సుల ఆధారంగానే కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 17 (భారత శక్తి): తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రజాపాలన వారోత్సవాలు, సౌదీ అరేబియా ప్రమాదంలో మరణించిన వారికి పరిహారం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో, డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ, నవంబర్ 17 (భారత శక్తి): ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచీ తరచూ 300 నుంచి 400 దాటుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని పేర్కొంది. కాలుష్యం నేపథ్యంలో రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని స్పష్టం చేసింది. ఢిల్లీలో వేగంగా పెరుగుతున్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు నిర్మాణాలపై నిషేధం విధించడం వంటి సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలని సూచించింది.

## ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం వల్లే 'జూబ్లీహిల్స్'లో భాజపా ఓటమి: ఎంపీ ఈటల

సికింద్రాబాద్, నవంబర్ 17 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భాజపా ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం వల్లే ఓటమి పాలైందని మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలు మాత్రం గత ఆరు నెలల నుంచే ఎన్నికల కార్యాచరణ ప్రారంభించాయన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓడినంత మాత్రాన భాజపా పని అయిపోయిందని మాట్లాడటం సరికాదన్నారు. ''హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా? తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 9 ఉప ఎన్నికలు జరగ్గా అందులో 7 సందర్భాల్లో అధికార పార్టీ గెలిచింది. రెండింట్లో భాజపా గెలిచింది. జూబ్లీహిల్స్ ఎన్నికలో అధికార పార్టీ డబ్బులు, చీరలు పంపిణీ చేసి అధికార



దుర్వినియోగానికి పాల్పడింది. హైదరాబాద్‌లో పాలనా వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. నగర జనాభాను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య నిర్వహణ సరిగా చేపట్టాలి. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలపై విన్నవిస్తా. ఖాళీగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను వెంటనే కేటాయించాలని, పేదల ఇళ్లను హైడ్రా కూల్చకుండా చూడాలని కోరతా''అని ఎంపీ ఈటల చెప్పారు.

## ఓటు చోరీపై నిరసనలు తెలుపుతాం :మంత్రి పొన్నం



హైదరాబాద్: భాజపా అధికారంలోకి రావడానికి అనేక రకాలుగా ఓట్లు తొలగించి చోరీకి పాల్పడుతోందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో తెలంగాణ యువజన కాంగ్రెస్ మహా నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నంతోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ యూత్ కాంగ్రెస్ సైనికులుగా మారి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి శక్తివంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా ఓటుచోరీపై నిరసనలు ఉద్ధృతం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఇంటింటికి తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే, సౌదీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన యాత్రికులకు యూత్ కాంగ్రెస్ నివాళులర్పించింది.

# ఢిల్లీ పేలుడు ఘటనలో కొత్త అంశం... షూలో ట్రిగ్గర్ మెకానిజం!

ఢిల్లీ, నవంబర్ 17 (భారత శక్తి): ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో నవంబర్ 10న జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడిలో సూసైడ్ బాంబర్ తన 'షూ'లోనే ట్రిగ్గర్ మెకానిజం అమర్చుకుని ఉంటాడనే కోణంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) లోతుగా విచారణ జరుపుతోంది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. నవంబర్ 10న సాయంత్రం రద్దీ సమయంలో హ్యుండాయ్ i20 కారులో శక్తిమంతమైన పేలుడు పదార్థాలతో వచ్చిన ఉగ్రవాది, మెట్రో స్టేషన్ వద్ద తనను తాను పేల్చుకున్నాడు. అత్యంత సున్నితమైన 'మదర్ ఆఫ్ సాతాన్'గా పిలిచే ట్రైయాసిటోన్ ట్రైపెరాక్సైడ్ (TATP)ను ఈ దాడిలో వాడినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు తీవ్రతకు కారు తునాతునకలైంది. ఘటనా స్థలంలో డ్రైవర్ సీటు కింద దొరికిన ఓ షూ దర్యాప్తును కొత్త మలుపు తిప్పింది. ఈ షూ లోపల ఉన్న మెటల్ భాగాన్ని ట్రిగ్గర్‌గా వాడి ఉండవచ్చని ఎన్ఐఏ అనుమానిస్తోంది. కారు శకలాల మధ్య లభించిన ఓ చీలిన పాదం కూడా దాడి చేసిన ఉగ్రవాదిదేనని భావిస్తున్నారు. 2001లో రిచర్డ్ రీడ్ అనే ఉగ్రవాది విమానం పేల్చేందుకు ప్రయత్నించిన 'షూ బాంబ్' ఘటనను ఈ విధానం గుర్తుచేస్తోంది. ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడింది ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా యూనివర్సిటీలో మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన జైష్‌ఇమొహమ్మద్ ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ అని గుర్తించారు. అక్టోబర్ 30న అతడి సహచరుడు డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉమర్ పరారయ్యాడు. ఈ ఉగ్రవాద మాడ్యూల్‌లో ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు 'వైట్ కాలర్' నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఘటనా స్థలంలో 9ఎంఎం తూటాలు కూడా లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మెవాట్ ప్రాంతంలోని హవాలా నెట్‌వర్క్ ద్వారా నిధులు సమకూరినట్లు ఆధారాలు లభించాయి. ఈ కేసులో ఇప్పటికే ఒక సహాయకుడిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. నూహ్, ఫరీదాబాద్ ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తూ దర్యాప్తును ముమ్మరం చేసింది.

## సౌదీలో ఘోర బస్సు ప్రమాదం.. బాధితులను ఆదుకోవాలన్న కేసీఆర్

హైదరాబాద్, నవంబర్ 17 (భారత శక్తి): సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన పలువురు యాత్రికులు మరణించారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనా వెళుతున్న బస్సు అగ్నిప్రమాదానికి గురవడంతో 42 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్ర ముగించుకుని మదీనాకు వెళుతున్న యాత్రికుల బస్సు ఇవాళ తెల్లవారుజామున 1:30 గంటలకు బదర్‌మదీనా మార్గమధ్యంలోని ముఫరహత్ వద్ద ఓ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో భారీగా మంటలు చెలరేగి, నిద్రలో ఉన్న ప్రయాణికులు అగ్నికి ఆహుతయ్యారు. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ఈ దుర్ఘటనలో మరణించిన వారిలో హైదరాబాద్‌లోని మల్లేపల్లి బజార్‌ఘాట్‌కు చెందిన 16 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేసిన కేసీఆర్, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సచివాలయంలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. బాధితుల వివరాల కోసం 79979 59754, 99129 19545 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

## ఆరేళ్ల తర్వాత చైనాకు ఎయిరిండియా... ఢిల్లీ నుంచి షాంఘైకి నాన్‌స్టాప్ విమానాలు!

ఢిల్లీ, నవంబర్ 17 (భారత శక్తి): టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా విమానయాన సంస్థ సోమవారం కీలక ప్రకటన చేసింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత చైనాకు మళ్లీ తమ సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించింది. వచ్చే ఏడాది (2026) ఫిబ్రవరి 1 నుంచి ఢిల్లీ, చైనాలోని షాంఘై నగరాల మధ్య నాన్‌స్టాప్ విమానాలను నడపనున్నట్లు తెలిపింది. ఈ మార్గంలో వారానికి నాలుగు సార్లు బోయింగ్ 7878 విమానాలతో సేవలు అందిస్తామని ఎయిరిండియా పేర్కొంది. ఈ విమానంలో బిజినెస్ క్లాస్‌లో 18 ఫ్లాట్ బెడ్ సీట్లు, ఎకానమీ క్లాస్‌లో 238 విశాలమైన సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించింది. అంతేకాకుండా, అవసరమైన అనుమతులు లభిస్తే 2026లోనే ముంబై నుంచి కూడా షాంఘైకి నాన్‌స్టాప్ సర్వీసులను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సర్వీసుల పునఃప్రారంభంపై ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ, "ఇది కేవలం ఒక కొత్త మార్గాన్ని ప్రారంభించడం కాదు. రెండు గొప్ప ప్రాచీన నాగరికతలు, ఆధునిక ఆర్థిక శక్తుల మధ్య ఇదొక వారధి వంటిది. వాణిజ్యం, విద్య, వైద్యం, సాంస్కృతిక రంగాల్లో ప్రయాణికులకు అవకాశాలు కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. 2020 ప్రారంభంలో నిలిచిపోయిన విమాన సంబంధాలను పునరుద్ధరించేందుకు ఇటీవల భారత్‌చైనా మధ్య కుదిరిన దౌత్య ఒప్పందాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సర్వీసుల కోసం దశలవారీగా బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. కాగా, ఇటీవలే ఇండిగో సంస్థ కూడా ఢిల్లీ నుంచి చైనాలోని గ్వాంగ్‌జౌకు రోజువారీ విమాన సర్వీసులను ప్రారంభించిన విషయం

## ఏఐ ఉద్యోగాల కంటే అదే పెద్ద సంక్షోభం: ఆనంద్ మహీంద్రా ట్వీట్

ఢిల్లీ, నవంబర్ 17 (భారత శక్తి): కృత్రిమ మేధ (ఏఐ) రాకతో వైట్ కాలర్ ఉద్యోగాలు కనుమరుగవుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అయితే, దీనికంటే పెద్ద సంక్షోభం మన ముందు ఉందని, దాన్ని మనం గుర్తించడం లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా అన్నారు. నైపుణ్యం కలిగిన కార్మికుల కొరతే అసలైన సమస్య అని ఆయన తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం 'ఫోర్డ్' సీఈవో జిమ్ ఫార్లే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పిన విషయాన్ని ఆయన ఉటంకించారు. ఫోర్డ్‌లో ప్రస్తుతం 5,000 మెకానిక్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో చాలా వాటికి వార్షిక వేతనం రూ. కోటి (1,20,000 డాలర్లు)కి పైగా ఉన్నప్పటికీ భర్తీ కావడం లేదని మహీంద్రా పేర్కొన్నారు. ఇది కేవలం ఫోర్డ్ కంపెనీకే పరిమితం కాదని, అమెరికా వ్యాప్తంగా ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ట్రక్కింగ్ వంటి రంగాల్లో పది లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దశాబ్దాలుగా మన సమాజం డిగ్రీలు, డెస్క్ ఉద్యోగాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, నైపుణ్యం ఆధారిత శ్రామిక శక్తిని విస్మరించిందని మహీంద్రా విశ్లేషించారు. నైపుణ్యం, అనుభవం, నేర్పు అవసరమైన ఈ పనులను ఏఐ భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రపంచాన్ని నిర్మించే, నడిపించే, మరమ్మతులు చేసే నైపుణ్యం ఉన్నవారే 'ఏఐ యుగంలో' అతిపెద్ద విజేతలుగా నిలుస్తారని ఆయన జోస్యం చెప్పారు. నైపుణ్యం, కొరత కారణంగా కార్మికులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని, ఇది హింస ద్వారా కాకుండా నైపుణ్యం ద్వారా వచ్చే విప్లవమని కార్ల్ మార్క్స్ కూడా ఊహించి ఉండరంటూ తన పోస్ట్‌ను ముగించారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ

### స్పీకర్‌కు 4 వారాల గడువు

ఢిల్లీ, నవంబర్ 17 (భారత శక్తి): తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. అలాగే మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ 36వ నంబరులో ఉంది. స్పీకర్ మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవడంలో విఫలమైనందున నేరుగా న్యాయస్థానమే తమ పిటిషన్లపై విచారణ చేపట్టి నిర్ణయం వెలువరించాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన మరో రిట్ పిటిషన్ 37వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.

# వెంటాడుతున్న వైఫల్యాలు..

- రేవంత్ రెడ్డి పరిపాలనకు మచ్చ తెస్తున్న అవినీతి కార్యకలాపాలు..
- ముఖ్యమంత్రి దృష్టికి రావటం లేదా..? వచ్చినా పట్టించుకోవడం లేదా..?
- అన్ని శాఖల్లోనూ విశృంఖలంగా రాజ్యమేలుతున్న అవినీతి..
- ముఖ్యమైన శాఖలన్నీ ముఖ్యమంత్రి ఆధీనంలో ఉండడం ఒక కారణం అవుతోందా..?
- పర్యవేక్షణ లోపం కూడా ఒక కారణం అవుతోందని విశ్లేషిస్తున్న మేధావులు..
- అవినీతికి భారీగా అవకాశం ఉన్న శాఖలన్నీ తన వద్దే ఉంచుకోవడంలో మతలబు ఏమిటి..?
- అవినీతికి తావు లేకుండా చేయడం కోసమా..?
- వేరే ఎవరికీ అవకాశం లేకుండా చేయడం కోసమా..?
- ఇతరులకు ఈ శాఖలను కేటాయిస్తే తనను మించి పోతారని భయమా..?
- ఫెయిల్యూర్ ముఖ్యమంత్రి అనిపించుకుంటున్న రేవంత్ రెడ్డి పరిపాలనలో లోపాలు ఏమిటి..?
- ఎందుకని అధికారులను కట్టడి చేయలేకపోతున్నారు..?
- రేవంత్ రెడ్డి రెండేళ్ల





**పరిపాలనపై విశ్లేషణాత్మక కథనాన్ని అందిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "**

***(స్పెషల్ కరస్పాండెంట్) :***
***హైదరాబాద్, నవంబర్ 17 ( భారత శక్తి ) :***

సజావుగా సాగుతున్న రేవంత్ రెడ్డి పరిపాలనలో ముఖ్యమైన శాఖల్లో అవినీతి భారీగా పేరుకుని పోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ ప్రజల్లోనూ తీవ్రమైన చర్చకు దారి తీసింది.. అవినీతి రహిత ప్రజా పాలన అందిస్తానని వాగ్దానం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కూడా మునుపటి ప్రభుత్వంలో జరిగిన అవినీతి కార్యకలాపాలు యధావిధిగా కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.. అయితే ఏ శాఖలో అవినీతి భారీగా జరిగే అవకాశం ఉందో ఆయా శాఖలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్ద ఉంచుకోవడం ఏమిటి అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తూ ఉన్నారు.. ఆయా శాఖలను నిర్వహించే సామర్థ్యం ఇతరులకు లేవా..? లేక ఆయా శాఖలు కేటాయించిన వారు అవినీతికి పాల్పడుతారని జాగ్రత్త పడుతున్నారా..? అలాకాకుండా ఆయా శాఖల్లో తాను మాత్రమే అవినీతికి పాల్పడి భారీగా అక్రమార్చన చేయవచ్చు అనే భావనతో రేవంత్ రెడ్డి ఉన్నాడా..? అన్న అనుమానాలను కూడా రాజకీయ విశ్లేషకులు బహిర్గతం చేస్తున్నారు.. ఏది ఏమైనా ముఖ్యమైన శాఖలన్నీ తన వద్ద ఉంచుకోవడంతో రేవంత్ రెడ్డి రాజకీయ భవితవ్యం పై తీవ్రమైన ప్రభావం చూపుతోందని విశ్లేషకులు సూచిస్తూ ఉన్నారు..

పరిపాలన సౌలభ్యం కోసం శాఖలన్నింటిని ఇతరులకు కేటాయించడం ఆ శాఖలను సమన్వయం చేసుకోవడం, చూసుకోవడం ముఖ్యమంత్రి విధిగా భావిస్తారు.. కానీ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అది జరగటం లేదన్నది వాస్తవం.. గడచిన టిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఇదే సమస్య తీవ్రంగా ఉండేది.. ఆ ప్రభుత్వంలో పేరుకు మాత్రమే మంత్రులు వారికి శాఖలు కేటాయించబడి ఉండేవి.. కానీ పెత్తనం అంత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన తనయుడు కేటీఆర్, అంతో ఇంతో హరీష్‌రావు వీళ్లు మాత్రమే ఆధిపత్యం చెరయించేవాళ్లు.. అప్పట్లో కుటుంబ పాలన అంటూ ఎన్నెన్నో విమర్శలు తలెత్తాయి.. మరి ఇప్పుడేం జరుగుతోంది..? అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగినట్టుగానే ఇప్పుడు కూడా పరిపాలన కొనసాగుతోంది అన్నది విమర్శకుల ప్రశ్న.. అయితే దీనంతటికీ కారణం ఏమిటి..? రేవంత్ రెడ్డికి అనుభవం లేకపోవడమా..? విషయాలపై పట్టు లేకపోవడంమా..? అందరినీ గుడ్డిగా నమ్మడమా..? లేకపోతే ఎవరిమీద నమ్మకం లేకపోవడమా..? ఏది ఏమైనా రాష్ట్రంలో జరుగుతున్న విషయాలన్నీ రేవంత్ రెడ్డికి తెలియకుండా జరుగుతున్నాయా..? తెలిసి జరుగుతున్నాయా అన్నది ఇక్కడ అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది.. ఎందుకంటే మరీ ముఖ్యంగా రేవంత్ రెడ్డి తన దగ్గర ఉంచుకున్న ముఖ్యమైన శాఖలలోనే విపరీతమైన అవినీతి జరుగుతోంది... మరి ఇది రేవంత్ రెడ్డి దృష్టికి రాలేదా.. అధికారులు ఆయన దృష్టికి రానివ్వడం లేదా..? ఒకవేళ తెలిసినా తెలియనట్లు నిమ్మకుండి పోతున్నారా..? అనూహ్యంగా వచ్చిన అద్భుతమైన అవకాశాన్ని రేవంత్ రెడ్డి సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడా..? ఎందుకని ఆయన ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా పిలిపించుకుంటున్నారు..? అన్నది కూడా అర్థం కాకుండా ఉంది.. వీటన్నిటి వెనుక జరుగుతున్న పరిణామాలు ఏమిటి..? ప్రస్తుతం రేవంత్ రెడ్డి చేయవలసినది ఏమిటి..? ఇటీవల హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధించడంతో రేవంత్ రెడ్డి పరిపాలనపై ప్రజలకు ఇంకా నమ్మకముంది అన్నది స్పష్టంగా తెలుస్తోంది.. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతి అనే కూపంలో కూరుకుని పోవడం పార్టీకి వ్యక్తిగతంగా రేవంత్ రెడ్డికి ఎన్నో ఆశలు పెట్టుకున్న తెలంగాణ ప్రజలకు కూడా ఎంతో నష్టాన్ని కలిగిస్తుంది.. ఒకవేళ రేవంత్ రెడ్డికి తెలియకుండా అవినీతి జరుగుతూ ఉన్నట్లయితే.. ఆయన ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని ముందుకు పోతే చరిత్రలో మిగిలిపోతాడు.. లేదంటే అందరిలాగే చరిత్ర హీనుడు అవుతాడని విశ్లేషకులు సూచిస్తూ ఉన్నారు.. హైడ్రా లాంటి ఉత్కృష్టమైన సంస్థలను ఏర్పాటు చేసి అవినీతిని ఉక్కు పాదంతో అణచివేయాలని రేవంత్ రెడ్డి ప్రయత్నించడం ఎంతో అద్భుతమైన విషయం.. కానీ హైడ్రా కూడా అవినీతిమయంలో చిక్కుకోవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.. ఇలాంటి మంచి మంచి నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభకు ఎందుకు మసక అంటుతోంది..? దీనికి కారణం ఏమిటి..? అసలు రాష్ట్రంలో ఏమీ జరుగుతోంది..? అవినీతి మూలాలు ఎక్కడెక్కడ ఉన్నాయి..? టిఆర్ఎస్ ప్రభుత్వంలో వెలుగులోకి వచ్చిన అవినీతి నాయకులు అవినీతి అధికారులు అవినీతితో కూడిన పనులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కూడా కొనసాగుతుండడంలో ఆంతర్యం ఏమిటి..?




ఈ విషయాలపై కూలంకుషంగా వాస్తవాలను ఆధారాలతోసహా క్రోడీకరించి వరుస కథల ద్వారా మీ ముందుకు తీసుకుని రానుంది" భారత శక్తి " దినపత్రిక ద్వారా " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ "..





## జిన్నింగ్ మిల్లర్ల సమస్యలు పరిష్కరిద్దాం తెలంగాణకు రండి

**: సీసీఐని కోరిన మంత్రి తుమ్మల**



హైదరాబాద్, నవంబర్ 17 (భారత శక్తి): తెలంగాణలో జిన్నింగ్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యయసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతుల పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు తెలంగాణ జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రకటించిన నేపథ్యంలో రైతుల, జిన్నింగ్ మిల్లర్ల సమ్యలపై చర్చించేందుకు మంగళవారం రాష్ట్రానికి రావాలని సీఐఐ సీఎండీ, ఇతర అధికారులను కోరారు. సచివాలయం నుంచి రాష్ట్ర సహకార సంస్థ ఛైర్మన్, సీఈవో, జిల్లా సహకార అధికారులతో మంత్రి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ సంబంధించి సీసీఐ తీసుకొచ్చిన నిబంధనల కారణంగా క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతుండటం, జిన్నింగ్ మిల్లుల యజమానులు గిట్టుబాటు కావడం లేదంటుండటంతో నెలకొన్న గందరగోళానికి తెరదించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షలో విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర జౌళి శాఖమంత్రి గిరిరాజ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండాపోయిందని మంత్రి అన్నారు. పత్తి రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని తక్షణమే జిన్నింగ్ మిల్లర్ల సమస్యల పరిష్కరించే దిశగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవ చూపాలని కోరారు. రైతుల సంక్షేమమే ముఖ్యంగా డీసీవోలు, డీసీసీబీల పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. సోయాబీన్ సేకరణలో నాఫెడ్ తీసుకొచ్చిన ఆధార్ అథెంటికేషన్ నిబంధన కారణంగా రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని మార్క్ ఫెడ్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు.

## గుడ్ న్యూస్.. విశాఖ కొల్లం మధ్య 20 ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, నవంబర్ 17 (భారత శక్తి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం కేరళలోని కొల్లం మధ్య 20 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. మంగళవారం నుంచి జనవరి 21 వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఈ నెల 18 నుంచి ప్రతి మంగళవారం విశాఖ కొల్లం (08539), ప్రతి బుధవారం కొల్లం విశాఖపట్నం (08540) రైళ్లు రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, రేణిగుంట మీదుగా నడుస్తాయి. 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ బోగీలతో ఈ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే పేర్కొంది. ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో తెలిపింది.

## ఆదివాసి గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యం

**: మధుయాష్కి గౌడ్**

*** రాజ్ భవన్ లో గవర్నర్ తో నిర్వహించిన ఆదివాసి గిరిజన యువత ఇంట్రాక్షన్ కార్యక్రమానికి అతిథిగా హాజరైన మధుయాష్కీ గౌడ్**





హైదరాబాద్, నవంబర్ 17 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర రాజ్ భవన్ లో జరిగిన గిరిజన యువతతో ఇంట్రాక్షన్ ( వాలిడిక్టరీ) కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో 17వ ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా వారం రోజుల పాటు నగరంలో జరిగిన గిరిజన యువత సమ్మేళనంలో చత్తీస్ ఘడ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని వివిధ జిల్లాలకు చెందిన చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. చివరి రోజు అయిన సోమవారం ఉదయం వారు గవర్నర్ కార్యాలయాన్ని సందర్శించారు. వారం రోజుల పాటు తాము తెలుసుకున్న అంశాలను, నూతన ఆవిష్కరణలకు సంబంధించి వారి మధ్య జరిగిన చర్చలను గవర్నర్ తో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారికి నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను గవర్నర్, మధుయాష్కీ కలిసి అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగం అనంతరం మధుయాష్కీ మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇప్పటికీ గిరిజన, ఆదివాసి ప్రాంతాలలో రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, తాగునీరు లాంటి కనీస సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. సామాజిక ఆర్థిక అణిచివేత కారణంగా చాలా మంది యువత నక్సలిజం వైపు వెళ్తున్నారన్నారు. ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధి జరిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజన ప్రాంతాలలో అనేక వనరులు ఉన్నాయని, కానీ వారికి సరైన సదుపాయాలు, సంపదలో వాటా దక్కకపోవడం బాధాకరమన్నారు. అధికారంలో ఎవరున్నా ఆదివాసి యువత తమ హక్కుల కోసం, తమ శ్రమకు తగ్గట్టు ఫలితం కోసం ప్రశ్నిస్తూనే ఉండాలని సూచించారు. ఆదివాసి యువతకు ఉపాధి, ఉద్యోగాలు, అన్ని రంగాలలో అవకాశాలు కల్పించినప్పుడే వారి అభ్యున్నతికి దోహదం చేసిన వారమవుతామన్నారు. ఆదివాసి గిరిజన యువత ఉన్నత స్థానాలకు ఎదిగి తాము పుట్టి పెరిగిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరం పర్యటనలో భాగంగా వారు నేర్చుకున్న అంశాలను యువత ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ యూత్ ఆఫీసర్ కుశ్బు, రైల్వే బోర్డు మెంబర్ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.